సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 10.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 003
పేజీలు: 08 వెల: రూ. 5

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్

జనవరిలో ప్రకటనకు ఈసీ కసరత్తు

- యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్‌లలో
- షెడ్యూల్ ప్రకటనకు ముందు రాష్ట్రాల్లో పర్యటించనున్న ఈసీ
- యూపీలో పలు దశల్లో మిగతా రాష్ట్రాల్లో ఒకే విడతలో!
- ఇప్పటికే 3 రాష్ట్రాల్లో డిప్యూటీ కమిషనర్ల స్థాయి పర్యటనలు పూర్తి



కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష!

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు..
- రంగారెడ్డి కలెక్టర్‌కు షాక్!
- ఐఏఎస్ అధికారికి హైకోర్టు కఠిన శిక్ష.. రూ.2 వేల జరిమానా కూడా!
- కోర్టు ధిక్కరణ కేసులో సంచలన తీర్పు..



కేసీఆర్‌కు రేవంత్ ఓపెన్ ఛాలెంజ్!

కుటుంబ సమేతంగా సభకు రావాలి

- కాళేశ్వరం నుంచి గోదావరి జలాల వరకు చర్చిద్దాం
- డిసెంబర్‌లో రెండు మూడు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సీఎం ప్రతిపాదన..
- ప్రాణహిత, పాలమూరు ప్రాజెక్టులపైనా చర్చకు సిద్ధం



బియ్యం ధరలకు కళ్లెం

కిలోకు గరిష్ట ధరలు ఫిక్స్..!


- బియ్యం రకాలను బట్టి గరిష్ట ధరలు ఖరారు
- కిలోకు రూ.66 నుంచి రూ.79 వరకు పరిమితి
- నకిలీ స్టిక్కర్లతో అమ్మితే కఠిన చర్యలు
- అక్రమ నిల్వలపై పీడీ యాక్ట్ హెచ్చరిక



ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

సీఐడీ కొరడా.. బీఆర్ఎస్‌లో కలవరం!

- వేల ఎకరాల రికార్డుల ట్యాంపరింగ్‌పై విచారణ
- ధరణి కుంభకోణంలో కీలక వ్యక్తుల అరెస్టులు!
- మాజీ మంత్రులు, ఐఏఎస్‌ల చుట్టూ సీఐడీ ఉచ్చు?
- డిజిటల్ ఆధారాలతో పెద్ద తలకాయలకు షాక్!
- నిషేధిత భూములజాబితాలో అక్రమ మార్పులా?
- కాంగ్రెస్ vs బీఆర్ఎస్.. ధరణితో రాజకీయ యుద్ధం
- కక్షసాధింపు అంటున్న గులాబీ పార్టీ.. విచారణకు సర్కార్ సై!
- ధరణి దర్యాప్తులో తదుపరి టార్గెట్ ఎవరు?



ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణ రాజకీయాల్లో ధరణి భూముల పోర్టల్ వ్యవహారం మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రచారం చేసిన ధరణి పోర్టల్‌లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ అక్రమాలపై సీఐడీ దర్యాప్తు వేగవంతం చేసింది. హైదరాబాద్ పరిసర జిల్లాలతో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో రహస్య ఆపరేషన్లు నిర్వహిస్తూ పోర్టల్ డెవలపర్లు, రెవెన్యూ ఆపరేటర్లు, డాక్యుమెంట్ రైటర్లను అదుపులోకి తీసుకోవడం తీవ్ర చర్చకు దారితీసింది.

రికార్డుల్లో మార్పులా?
ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసినట్లు చెబుతున్న అంశాలు ఈ వ్యవహారాన్ని మరింత సంచలనంగా మార్చాయి. సెక్షన్ 22–ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూములు, అసైన్డ్ భూములు, సీలింగ్ మిగులు భూముల రికార్డులను నిబంధనలకు విరుద్ధంగా మార్చి ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ రికార్డుల ట్యాంపరింగ్, అధికారులపై ఒత్తిళ్లు, నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు వంటి అంశాలపై సీఐడీ లోతుగా విచారిస్తోంది.

పెద్ద తలకాయల వైపు దర్యాప్తు చూపు!
ఈ వ్యవహారం కేవలం కింది స్థాయి ఉద్యోగులు, ఆపరేటర్లకే పరిమితం కాకపోవచ్చన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. నాటి ప్రభుత్వంలోని కీలక నేతలు, మంత్రులు, ఉన్నతాధికారుల పాత్రపైనా దర్యాప్తు సంస్థలు దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. డిజిటల్ లాగ్ ఫైల్స్, ఐపీ అడ్రస్‌లు, రికార్డుల మార్పులకు సంబంధించిన సాంకేతిక ఆధారాల ఆధారంగా అసలు సూత్రధారులను గుర్తించే ప్రయత్నం జరుగుతోంది.

కక్షసాధింపు అంటున్న బీఆర్ఎస్..
మరోవైపు, ఈ దర్యాప్తు రాజకీయ రంగు పులుముకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ధరణి కేసును తెరపైకి తెచ్చిందని బీఆర్ఎస్ నేతలు మిగతా 02లో



ఉక్కిరిబిక్కిరి

పటాకుల మోతతో పెరిగిన కాలుష్యం
ఊపిరి ఆడని భాగ్యనగరం

- హైదరాబాద్‌లో 600 దాటిన ఏక్యూఐ
- దీపావళి దెబ్బకు విషతుల్యమైన గాలి
- ఐటీ కారిడార్‌లో ప్రమాదకర కాలుష్యం
- ఢిల్లీని కమ్మేసిన విషపూరిత పొగ
- గ్యాస్ చాంబర్‌ను తలపిస్తున్న దేశ రాజధాని
- పంజాబీ బాగ్‌లో 993కు చేరిన పీఎం2.5

ముద్ర, తెలంగాణ బ్యూరో :
ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు కాలుష్యం! ఐటీ హబ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందుతున్న హైదరాబాద్‌ను ఇప్పుడు వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణానికి పేరుగాంచిన భాగ్యనగరం క్రమంగా కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. వాహనాల పొగ, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి, పారిశ్రామిక ఉద్గారాలకు దీపావళి పటాకుల కాలుష్యం తోడవడంతో నగరంలో గాలి నాణ్యత ఒక్కసారిగా క్షీణించింది. కొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 600 పాయింట్లను దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీ పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడి గాలిలో విషపూరిత కణాల స్థాయిలు ప్రమాదకర స్థాయికి చేరడంతో నగరం గ్యాస్ చాంబర్‌ను తలపిస్తోంది.
దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో పెద్దఎత్తున పటాకులు కాల్చడంతో నగరమంతా పొగ, ధూళి కణాలతో నిండిపోయింది. అర్ధరాత్రి దాటి నా టపాసుల మోత కొనసాగడంతో గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం పడింది. బంజారాహిల్స్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, సోమాజిగూడ వంటి ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఎక్కువగా నమోదైంది. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మిగతా 02లో

జనవరి 25 నుంచి జనాభా లెక్కలు

జనవరి 10 నుంచి సెల్ఫ్ ఎన్యూమరేషన్!




- ఫిబ్రవరి 28 వరకు జనగణన ప్రక్రియ
- మార్చి 1 నుంచి రివిజనల్ రౌండ్
- జనగణన-2027కు తెలంగాణ సర్కార్ సన్నాహాలు పూర్తి

2

పట్నం అరెస్ట్ అక్రమం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




- పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళ్తుండగా అరెస్ట్
- రేవంత్ పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నట్లు వెల్లడి

2

సీపీఎస్ నుంచి ఓపీఎస్

ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ

- పాత పెన్షన్ విధానానికి మారే మార్గదర్శకాలు ఖరారు
- ఏపీ ఉద్యోగులకు ఓపీఎస్ అవకాశం.. జీవో విడుదల
- డిసెంబర్ 31 వరకు దరఖాస్తుకు గడువు



ఇదీ AI ముద్ర

టపాసుల పొగతో హైదరాబాద్ లో ఊపిరితీసుకోవడమే గగనమైంది.. ఇదంతా మనం చేసుకున్న స్వయంకృతాపరాధం..






పాలమూరు అభివృద్ధికి అడ్డొస్తే సహించేది లేదు

లగచర్ల బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

- పాలమూరు ప్రజల గుండెలపై తన్ని గజ్వేల్ పోయిండు
- కేసీఆర్ అప్పులకు రూ.లక్షల కోట్ల వడ్డీ కడుతున్నాం
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి హామీ
- రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రైవేట్ స్కూళ్లలో కొత్త స్క్రీనింగ్

నిర్లక్ష్యం చేస్తే చర్యలు.!




- 3 నుంచి 18 ఏళ్ల పిల్లలకు స్క్రీనింగ్
- దివ్యాంగత్వం, అభ్యసన లోపాల గుర్తింపు
- ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి తప్పనిసరి శిక్షణ
- నిర్లక్ష్యం చేస్తే యాజమాన్యాలదే బాధ్యత

2

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
మంగళవారం, 10 నవంబర్, 2026

రోగనిరోధక శక్తికి బూస్ట్:

దబ్బపండులోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడతాయి. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని అందిస్తాయి.



కేసీఆర్‌కు రేవంత్ ఓపెన్ ఛాలెంజ్!

ముద్ర, హైదరాబాద్:
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ప్రాజెక్టు నిర్మాణం, బ్యారేజీల ప్రస్తుత పరిస్థితి, గోదావరి జలాల వినియోగం, సాగునీటి ప్రణాళికలపై అసెంబ్లీ వేదికగా తేల్చుకుందామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి అసెంబ్లీకి రావాలని, డిసెంబర్‌లో రెండు 3 రోజులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలపై చర్చిద్దాం అన్నారు.
కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హకీంపేటలో నవంబర్ 7న నిర్వహించిన మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టులు, గోదావరి జలాల వినియోగం, రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలపై మాట్లాడారు. ఈ అంశాలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

సభకు రావాలని పిలుపు

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు అసెంబ్లీలోనే సమాధానం చెబుతామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టు నిర్మాణం నుంచి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రస్తుత పరిస్థితి వరకు అన్ని అంశాలను సభలో వివరిస్తామని తెలిపారు. ఇందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు. కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా సభకు వచ్చి చర్చలో పాల్గొనాలని సవాల్ చేశారు.

కాళేశ్వరం వర్సెస్ ప్రాణహిత

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాణహిత ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వడంపై సీఎం ప్రశ్నలు లేవనెత్తారు. ప్రాణహితకు జాతీయ హోదా అంశం ఉన్నప్పటికీ కాళేశ్వరం నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. మరోవైపు పాలమూరు ప్రాంతానికి సంబంధించిన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాల పురోగతిపైనా చర్చకు సిద్ధమని సంకేతాలిచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి, కన్నెపల్లి పంప్‌హౌస్‌ల నిర్వహణ, నీటి నిల్వలు, ప్రాజెక్టుల సామర్థ్యం వంటి అంశాలు కూడా ఈ చర్చలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.
ఎల్‌నినో.. రైతులకు ముందస్తు హెచ్చరిక
కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకే చర్చను పరిమితం చేయకుండా రాబోయే వ్యవసాయ సీజన్‌లో ఎదురయ్యే సవాళ్లపైనా అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని సీఎం రైతులను అప్రమత్తం చేశారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. గోదావరి, కృష్ణా జలాల వినియోగం, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించే అవకాశం ఉంది.

డిసెంబర్ సమావేశాలపై ఉత్కంఠ

కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు సీఎం స్వయంగా ప్రతిపాదించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా కేసీఆర్ కుటుంబ సభ్యులతో సహా సభకు రావాలని సవాల్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రత్యేక సమావేశాల తేదీలు, చర్చకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు ఎలా స్పందిస్తారు? అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి వాదనలు వినిపిస్తాయి?

ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)
విమర్శిస్తున్నారు. రాజకీయ కక్షతోనే విచారణను వేగవంతం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం భూ రికార్డుల్లో జరిగిన అక్రమాలను వెలికితీసి బాధిత రైతులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని చెబుతోంది.

రాబోయే రోజుల్లో ప్రకంపనలా?

ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాల వెనుక ఉన్న వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలు, భూ బదిలీల అసలు కథ బయటపడితే తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. దర్యాప్తులో కీలక ఆధారాలు లభిస్తే మరిన్ని అరెస్టులు, నోటీసులు ఉండవచ్చన్న చర్చ సాగుతోంది. అయితే ఎవరిపై అయినా ఆరోపణలు రుజువయ్యే వరకు వారిని నిందితులుగా నిర్ధారించలేం. మొత్తానికి ధరణి వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య మరో కీలక రాజకీయ అస్త్రంగా మారింది. సీఐడీ దర్యాప్తు ఎక్కడి వరకు వెళ్తుంది? అసలు సూత్రధారులు ఎవరు? అన్నది తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోంది.

ఉక్కిరిబిక్కిరి

(మొదటి పేజీ తరువాయి)
దీపావళి రాత్రి 9.30 గంటల సమయంలో హైదరాబాద్ నగర సగటు ఏక్యూఐ 509 పాయింట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. పీఎం2.5 స్థాయిలు క్యూబిక్ మీటరుకు 392 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. సాధారణ పరిమితి 60 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది అనేక రెట్లు అధికం. పీఎం10 స్థాయిలు కూడా 326 మైక్రోగ్రాములకు చేరాయి. అయితే సోమవారం ఉదయానికి నగర సగటు ఏక్యూఐ 160 పాయింట్లకు తగ్గింది. గాలి నాణ్యత పూర్తిగా మెరుగుపడలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఢిల్లీని కమ్మేసిన విషపూరిత పొగ

హైదరాబాద్ పరిస్థితి ఇలా ఉంటే దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం మరింత భయానకంగా మారింది. నగరాన్ని దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. నవంబర్ 9 తెల్లవారుజామున పంజాబీ బాగ్ ప్రాంతంలో పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు ఏకంగా 993 మైక్రోగ్రాములకు చేరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన 24 గంటల సగటు మార్గదర్శక పరిమితి 15 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది దాదాపు 66 రెట్లు అధికం.
ఆర్.కే. పురంలో 61.6 రెట్లు, వివేక్ విహార్‌లో 58.2 రెట్లు అధికంగా కాలుష్యం నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. బురారీ క్రానింగ్‌లో ఏక్యూఐ 441, రోహిణిలో 430 పాయింట్లకు చేరింది. ఆనంద్ విహార్, బవానా ప్రాంతాల్లో పర్యవేక్షణ కేంద్రాల డేటా అందుబాటులో లేకపోవడంతో అక్కడి పరిస్థితిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

ఇప్పటికైనా మేల్కొనకపోతే అంతే!

హైదరాబాద్‌లో కాలుష్యం పెరగడానికి పటాకులే ఏకైక కారణం కాదు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, రోడ్లపై పేరుకుపోతున్న దుమ్ము, నిర్మాణ పనులు, పారిశ్రామిక ఉద్గారాలు ఇప్పటికే గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. వీటికి పండుగ కాలుష్యం తోడవడంతో పరిస్థితి మరింత విషమిస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారు ఈ కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉంది.
కాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము నియంత్రణ, రోడ్ల శుభ్రత, వాహనాల ఉద్గారాల తనిఖీలు, పారిశ్రామిక కాలుష్యంపై కఠిన నిఘా అవసరమని అభిప్రాయపడుతున్నారు. పండుగల వేళ కాలుష్య నియంత్రణ నిబంధనలను కూడా సమర్థంగా అమలు చేయాల్సి ఉంది.
అభివృద్ధి పేరుతో నగరాలు విస్తరిస్తున్నా.. ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందకపోతే ఆ అభివృద్ధికి అర్థం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఢిల్లీ అనుభవం నుంచి హైదరాబాద్ ఇప్పటికైనా గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఒక ప్పుడు చల్లని వాతావరణానికి పేరుగాంచిన భాగ్యనగరం కూడా భవిష్యత్తులో గ్యాస్ చాంబర్‌గా మారే ప్రమాదం లేకపోలేదు!

కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష!

ముద్ర, హైదరాబాద్ :
న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను బేఖాతరు చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా హైకోర్టు నిర్ధారించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు కలెక్టర్‌కు 6 నెలల పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును 4 వారాల పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.



రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22–A ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు దాఖలు చేసిన వినతిని పరిశీలించాలని గతంలో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. 2025 ఆగస్టులో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 60 రోజుల్లోగా ఆ వినతిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, కోర్టు నిర్దేశించిన 60 రోజుల గడువు ముగిసినప్పటికీ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ నమోదైన తర్వాతే యంత్రాంగం కదిలింది. అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. ఆ తర్వాత జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే ఇలా ప్రక్రియను చుట్టేయడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానం ఆదేశించిన సమయంలో స్పందించకుండా, పిటిషన్ దాఖలయ్యాక నామమాత్రంగానే ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన హైకోర్టు, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని స్పష్టం చేస్తూ ధర్మాసనం కఠిన నిర్ణయం తీసుకుంది.

జనవరి 25 నుంచి జనాభా లెక్కలు

ముద్ర, హైదరాబాద్:
తెలంగాణలో జనగణన నిర్వహణకు తేదీలు ఖరారు చేశారు. రాష్ట్రంలో జనగణనపై తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీఓ నంబర్ 155 విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు రెండవ విడత జనాభా లెక్కల సేకరణను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఆ తర్వాత మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ చేపట్టనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. జనాభా వివరాల నమోదును మరింత సులభతరం చేస్తూ సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానానికి అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు ప్రత్యేక యాప్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోద చేసుకునే అవకాశం అందుబాటులో ఉండనుంది. తెలంగాణలో రాష్ట్రంలో మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి విడత ఇళ్ల గణన (హౌస్‌లిస్టింగ్) ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండో విడత జనాభా గణన కోసం అధికారులు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ, అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ ప్రక్రియను శరవేగంగా కొనసాగిస్తున్నారు.

బియ్యం ధరలకు కళ్లెం



ముద్ర, హైదరాబాద్:
రాష్ట్రంలో ఎగిసిపడుతున్న బియ్యం ధరల మంటపై తెలంగాణ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. మార్కెట్‌లో బియ్యం కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని పౌరసరఫరాల శాఖ తీవ్రంగా ఖండించింది. కృత్రిమ కొరత సృష్టించి సామాన్యుల జేబులకు చిల్లులు పొడుస్తున్న వ్యాపారుల ఆటకట్టించేందుకు నేరుగా రంగంలోకి దిగింది. వివిధ రకాల బియ్యం విక్రయాలపై గరిష్ట ధరల పరిమితిని నిర్ణయిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది.

రకాలను బట్టి గరిష్ట ధరలు ఇవే

ప్రజలపై అదనపు భారం పడకుండా ఉండేందుకు రకాలను బట్టి కిలో బియ్యం గరిష్ట ధరలను ప్రభుత్వం ఖరారు చేసింది. బీపీటీ (BPT), కేఎన్ఎమ్ (KNM) రకం బియ్యం కిలో గరిష్ట ధర రూ.66గా నిర్ణయించింది. అలాగే ఎంతో ఆదరణ ఉన్న ఆర్ఎన్ఆర్ (RNR), తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74కు మించకూడదని స్పష్టం చేసింది. ఇక హెచ్ఎమ్‌టీ (HMT), జేఎస్ఆర్ (JSR) రకం బియ్యం కిలో గరిష్ట ధర రూ.79గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పింది.
నకిలీ స్టిక్కర్లు, మోసాలపై నిఘా.. పీడీ యాక్ట్ హెచ్చరిక
అక్రమ సంపాదన కోసం వ్యాపారులు చేస్తున్న కొత్త రకం మోసాలపై పౌరసరఫరాల శాఖ ఆరా తీసింది. 25 కిలోల బియ్యం బస్తాపై 26 కిలోల స్టిక్కర్ వేసి విక్రయిస్తున్న అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతేకాకుండా, అసలు ఎంఆర్‌పీ ధరలపై ఎక్కువ రేట్లు ఉన్న నకిలీ స్టిక్కర్లను అతికించి అమ్ముతున్న వారిపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసింది. బియ్యం అక్రమ నిల్వలు ఉంచినా, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా ఉపేక్షించేది లేదని.. పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై ఏకంగా పీడీ యాక్ట్ (PD Act) ప్రయోగిస్తామని ప్రభుత్వం ఘాటుగా హెచ్చరించింది.
నేరుగా మిల్లర్ల నుంచే సరుకు.. ఫీల్డ్ తనిఖీలు ముమ్మరం
రిటైల్ వ్యాపారులకు బియ్యం అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇకపై రిటైలర్లు హోల్‌సేల్ వ్యాపారులపై ఆధారపడకుండా నేరుగా రైస్ మిల్లర్ల నుంచే బియ్యం సరఫరా పొందేలా ఏర్పాటు చేసింది. ఒకవేళ ఎక్కడైనా స్టాక్ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారికి (DSO) ఇండెంట్ ఇవ్వాలని సూచించింది. ధరల నియంత్రణ నిబంధనలు క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలవుతున్నాయో లేదో తేల్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో ఫీల్డ్ తనిఖీలను వేగవంతం చేసింది.

ప్రైవేట్ స్కూళ్లలో కొత్త స్క్రీనింగ్

ముద్ర, హైదరాబాద్ :
బడిలో చదువుతున్న ప్రతీ పిల్లాడూ ప్రత్యేకమే.. కానీ, కొందరు చిన్నారుల్లో ఉండే ప్రత్యేక అభ్యాసన లోపాలు లేదా దివ్యాంగత్వాన్ని సకాలంలో గుర్తించకపోతే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్రశస్త్' (PRASHAST) కార్యక్రమాన్ని అత్యంత కఠినంగా, ప్రాధాన్యతతో అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా తీసుకువచ్చిన ఈ సరికొత్త స్క్రీనింగ్ విధానంపై ఇప్పుడు విద్యా వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

అసలు ఏంటి ఈ 'ప్రశస్త్'?

3 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో ఉండే వివిధ రకాల దివ్యాంగత్వాలను, శారీరక లేదా మానసిక అభ్యాసన లోపాలను ముందస్తుగానే పసిగట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ 'ప్రశస్త్' (Pre-Assessment Holistic Screening Tool) స్క్రీనింగ్ విధానాన్ని రూపొందించింది. దీని ద్వారా చిన్నారుల సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, వారికి తగిన విద్యా సహాయం , వైద్య సదుపాయాలు అందించడానికి వీలు కలుగుతుంది.

ప్రైవేట్ యాజమాన్యాలకు కఠిన మార్గదర్శకాలు

ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. యూడీఐఎస్ఈ+ (UDISE+) రికార్డుల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు అందరూ తప్పనిసరిగా 'ప్రశస్త్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వారితో పాటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఇతర బోధనేతర సిబ్బంది కూడా ప్రిన్సిపాళ్ల లాగిన్ ద్వారా నిర్దేశించిన అవగాహన కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. అనంతరం పాఠశాలలో చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ నిర్దిష్ట సమయంలోగా స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

ఈ మహత్తర కార్యక్రమం నిర్దిష్ట గడువులోగా పూర్తయ్యేందుకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సహకరించాలని ప్రభుత్వం కోరింది. ఒకవేళ ఈ ఆదేశాలను నిర్లక్ష్యం చేసినా, స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేయడంలో విఫలమైనా సంబంధిత ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల భవిష్యత్తుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం తెచ్చింది.

సీపీఎస్ నుంచి ఓపీఎస్

ముద్ర, అమరావతి :
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోని అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవసరమైన సమగ్ర విధివిధానాలను ఖరారు చేస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నంబర్ 158ను జారీ చేసింది. అర్హత కలిగిన ఉద్యోగులు ఒకేసారి తమ ఆప్షన్ (వన్–టైమ్ ఆప్షన్) నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేసింది. ఈ నిర్ణయంతో 2004 సెప్టెంబర్ 1కి ముందు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలై, ఆ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారితో పాటు, అప్పటికే పదవీ విరమణ పొందినవారు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. దాదాపు 10,715 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు దీనివల్ల లబ్ధి చేకూరనుంది. ఓపీఎస్‌కు మారాలనుకునే అర్హులు 2026 డిసెంబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా తమ ఆప్షన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని 'నిధి' పోర్టల్ ద్వారానే నిర్వహిస్తారు. ఇందుకోసం ఉద్యోగులు తమ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్, ఎంపిక జాబితా, నియామక ఉత్తర్వులు, జాయినింగ్ ఆర్డర్ కాపీలను జతచేయాల్సి ఉంటుంది. ఓపీఎస్ ఎంచుకున్న ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాను ప్రారంభిస్తారు.

అక్రమంగా పట్నం అరెస్ట్

ముద్ర, హైదరాబాద్ :
కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.
ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్

ముద్ర, న్యూఢిల్లీ :
దేశంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను రానున్న జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది.
ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఈ పూర్తి స్థాయి బెంచ్, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో తమ పర్యటనలను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తుంది.
ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. నవంబర్ నెలాఖరు నాటికి ఈ బృందాలు తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి.
పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. జనాభా పరంగా, భౌగోళికంగా పెద్దదైన ఉత్తర ప్రదేశ్‌లో మాత్రం బహుళ దశల్లో ఎన్నికలు నిర్వహించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల అభిప్రాయాలను సమగ్రంగా విశ్లేషించిన తర్వాత, షెడ్యూల్ పై ఈసీ తుది నిర్ణయం తీసుకోనుంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.11.2026
www.mudranews.in | @mudranews

గుండె ఆరోగ్యానికి మేలు

ఎరుపు రంగు దబ్బపండులోని పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి. సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది.



దీపాల కాంతుల్లో మహాలక్ష్మిగా నిమిషాంబిక



ముద్ర, బోడుప్పల్: దీపావళి పర్వదినం సందర్భంగా మల్కాజగిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పెంటారెడ్డి కాలనీలో శ్రీ నిమిషాంబిక మాత మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. ఎర్రని పట్టువస్త్రం, స్వర్ణవర్ణ కిరీటం, ఆభరణాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కిరీటం చుట్టూ గులాబీ వర్ణపు కమలాలు, ఇరువైపులా పసుపు రంగు పూలమాలలు అలంకరణకు శోభనిచ్చాయి. అమ్మవారి అభయహస్తం చెంత నుంచి కిందకు జాలువారేలా అమర్చిన నోట్లమాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాదాల చెంత నాణేలతో నిండిన పాత్రలు, ఆభరణాలతో అలంకరించిన కలశాన్ని ఉంచారు. ఇరువైపులా వరుసగా వెలిగించిన దీపాల కాంతుల్లో మహాలక్ష్మి రూపం మరింత శోభాయమానంగా కనిపించింది. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమకాంత్ శర్మ సహ అర్చకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు పర్యవేక్షించారు.కార్యక్రమంలో ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, రామగిరి శ్రీకాంత్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), డి. సతీష్, ఎన్. శ్రీకాంత్, ఎన్. రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ టవర్స్‌లో ఘనంగా దీపావళి వేడుకలు



ముద్ర, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని తొమ్మిది ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టు ప్రాంతాల్లో దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బండ్లగూడ, కుల్సుంపురా, కేపీహెచ్‌బీ, గడ్డిఅన్నారం, కౌకూర్, పోచారం, రెడ్‌హిల్స్, మైలార్‌దేవ్‌పల్లి, రాయదుర్గంలో జరిగిన వేడుకల్లో లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు. తమకు సొంతిళ్లు నిర్మించనున్న ప్రాజెక్టు ప్రాంతంలోనే పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

2027 అక్టోబర్ నాటికి గోదావరి ప్రాజెక్టు పూర్తి చేయాలి

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్ భవిష్యత్తు తాగునీటి అవసరాలను తీర్చేందుకు చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్–2, 3 పనులను వేగవంతం చేయాలని జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2027 అక్టోబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఘన్‌పూర్‌లో నిర్మిస్తున్న 80 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, 1,170 ఎంఎల్‌డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పైప్‌లైన్, టన్నెల్ పనులకు అదనపు యంత్రాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి వేగం పెంచాలని సూచించారు. ప్రతి 15 రోజులకు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. రూ.7,360 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించనున్నారు. ఇందులో 17.50 టీఎంసీలు తాగునీటికి, 2.50 టీఎంసీలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మూసీ పునరుజ్జీవనానికి వినియోగించనున్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలి

నీటి లభ్యతను బట్టి సాగు.. పశుపోషణతో అదనపు ఆదాయం పొందాలి: మంత్రి వివేక్

ముద్ర, నర్సాపూర్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రాంచంద్రాపూర్‌లో నిర్వహించిన సమగ్ర పశుసంవర్ధక శిబిరంలో ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులు, గొర్రెలకు గాలికుంటు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు ఇప్పటికే మూడు మీటర్ల మేర తగ్గాయని, రానున్న రోజుల్లో నీటి కొరత పెరిగే ప్రమాదం ఉందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతుల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు అఖిలపక్ష బృందంతో ఢిల్లీకి వెళ్తామని తెలిపారు. ప్రాణహిత ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని, మెదక్ జిల్లా తాగునీటి అవసరాలకు సింగూరు జలాలను వినియోగించే అంశంపై నీటిపారుదల శాఖ మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధికి, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


టపాసుల మోత.. కంటి గాయాల బాట!

ముద్ర, హైదరాబాద్ : దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చడం పలువురికి విషాదాన్ని మిగిల్చింది. టపాసుల కారణంగా కంటి గాయాలకు గురైన 32 మంది హైదరాబాద్ మెహిదీపట్నంలోని ప్రభుత్వ సరోజినీదేవి కంటి ఆసుపత్రిని ఆశ్రయించారు. వీరిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు పెద్దలు కలిపి ఆరుగురిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మరో 26 మందికి వైద్యులు మందులు అందించి, తదుపరి వైద్య పరీక్షల కోసం రావాలని సూచించారు.ఈ ప్రమాదాల్లో ఒకరు కుడి కంటిచూపును పూర్తిగా కోల్పోయినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మరిన్ని కేసులు వచ్చినా చికిత్స అందించేందుకు ఆసుపత్రి సిద్ధంగా ఉందని ఆర్ఎంఓ డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. దీపావళి వేడుకల సమయంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

పాలమూరు అభివృద్ధికి అడ్డొస్తే సహించేది లేదు

పాలమూరు ప్రజల గుండెలపై తన్ని గజ్వేల్ పోయిండు కేసీఆర్ అప్పలకు రూ.లక్షల కోట్ల వడ్డీ కడుతున్నాం
జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి హామీ
డిసెంబర్ నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు తీసుకొస్తాం
లగచర్ల బహిరంగ సభలో బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు..
రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
లగచర్ల బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి





ముద్ర, మహబూబ్ నగర్ : పాలమూరు జిల్లా అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, వలసల నివారణే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. లగచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. డిసెంబర్ నాటికి కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకొచ్చి బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. బూర్గుల రామకృష్ణారావు నుంచి ఇప్పటివరకు ఎంతోమంది పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినా ఈ ప్రాంతంలో వలసలు ఆగలేదని, ప్రాజెక్టులు పూర్తికాక రైతుల పొలాలకు సాగునీరు అందలేదని సీఎం పేర్కొన్నారు. 75 ఏళ్లుగా పాలమూరు ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే పరిస్థితి తప్ప, వాటికి శాశ్వత పరిష్కారం లభించలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పాలమూరు కష్టాలు తీరుతాయని ఆశించామని, గతంలో కేసీఆర్‌ను గెలిపిస్తే ప్రాజెక్టులు పూర్తిచేస్తారని నమ్మామని చెప్పారు. అయితే పదేళ్లపాటు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

2023లో ప్రజల ఆశీస్సులతో కొడంగల్ బిడ్డగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే అవకాశం లభించిందని, అప్పటి నుంచి నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వం రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ప్రతి సంవత్సరం గత ప్రభుత్వ అప్పులపై సుమారు రూ.80 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందని, తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2 లక్షల కోట్లకు పైగా రుణ చెల్లింపులు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను గుర్తించి 2024 జనవరి 1 నుంచి ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

కొడంగల్‌కు కృష్ణా జలాలే లక్ష్యం

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను తమ ప్రభుత్వం ప్రారంభిస్తే అడ్డుకుంటామని కొందరు ప్రకటనలు చేస్తున్నారని సీఎం విమర్శించారు. ఎవరు అడ్డొచ్చినా వెనక్కి తగ్గకుండా పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకొచ్చి ఇక్కడి బీడు భూముల్లో పచ్చని పంటలు పండించే బాధ్యత తనదని, పోలేపల్లి ఎల్లమ్మ తల్లి సాక్షిగా ఈ హామీ ఇస్తున్నానని అన్నారు.

కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

గతంలో కొడంగల్ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు కొడంగల్‌ను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కొడంగల్‌లో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని భారీ పెట్టుబడులు తీసుకొచ్చి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

జర్నలిస్టులకు భరోసా

జర్నలిస్టులు అధైర్యపడవద్దని, వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రజల అండ ఉంటే ఢిల్లీలో ప్రధాని మోదీ అయినా, మరెవరైనా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తానని వ్యాఖ్యానించారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో ప్రజల్లోకి వస్తామని, ఎల్‌నినో ప్రభావాన్ని అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రజాబలంతో సునామీ సృష్టిస్తామని, ఆ సునామీలో రాజకీయ ప్రత్యర్థులు కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు.

డిసెంబర్ 7 నుంచి గ్లోబల్ క్లైమేట్ కాన్‌క్లేవ్

ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు కార్యాచరణకు ప్రాధాన్యం.. అంతర్జాతీయ పర్యావరణ నిపుణులకు ఆహ్వానాలు



ముద్ర, హైదరాబాద్ : ప్రపంచ స్థాయి పర్యావరణ నిపుణుల భాగస్వామ్యంతో డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో రెండు రోజుల అంతర్జాతీయ గ్లోబల్ క్లైమేట్ కాన్‌క్లేవ్ నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ – గ్లోబల్ సమ్మిట్ 2026'లో భాగంగా జరిగే ఈ సదస్సులో వాతావరణ మార్పులు, హరిత పెట్టుబడులు, ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనే ముందస్తు ప్రణాళికలపై చర్చించనున్నారు. సోమవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో కారణంగా ఎదురయ్యే వర్షాభావం, నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం, ఉష్ణోగ్రతల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రం ముందస్తుగా సిద్ధం కావాలని సూచించారు. వేసవిలో తాగునీటి భద్రత, పశుగ్రాసం లభ్యత, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కరువు నివారణ, సహాయక చర్యల కోసం నెలకు సుమారు రూ.1,000 కోట్లు సమీకరించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.సదస్సుకు పర్యావరణవేత్తలు రాజేంద్ర సింగ్, సునీతా నారాయణ్, సద్గురు, నార్వే మాజీ పర్యావరణ మంత్రి ఎరిక్ సోల్హీమ్‌లను ఆహ్వానించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సినీ నటి దియా మీర్జాతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ దేశాల రాయబారులను కూడా ఆహ్వానించనున్నారు.స్వచ్ఛమైన ఇంధనం, నీటి సంరక్షణ, క్లైమేట్ ఫైనాన్స్, హరిత సాంకేతికతలు, వ్యర్థాల నుంచి సంపద సృష్టి వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సదస్సును రూపొందిస్తున్నారు. నవంబర్ 28న వివిధ రంగాలకు చెందిన సుమారు 100 మంది ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రజాభిప్రాయాలను సేకరించనున్నారు. సదస్సు ద్వారా అంతర్జాతీయ గుర్తింపుతో పాటు ఆచరణ సాధ్యమైన కార్యాచరణ, పెట్టుబడి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

ఓలెక్ట్రా EBITDAలో 18 శాతం వృద్ధి

రూ.687 కోట్లకు చేరిన ఆదాయం..
త్రైమాసికంలో 401 ఎలక్ట్రిక్ వాహనాల విక్రయం
8 వేలకుపైగా ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ బుక్



ముద్ర, హైదరాబాద్ : ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 5 శాతం పెరిగి రూ.687.01 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం (EBITDA) 18 శాతం వృద్ధితో రూ.109.89 కోట్లకు చేరింది. పన్నుల అనంతర లాభం (PAT) 5 శాతం పెరిగి రూ.52.12 కోట్లుగా నమోదైంది. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ 401 ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే సమయంలో 375 వాహనాలను విక్రయించగా.. ఈసారి 7 శాతం వృద్ధి సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మొత్తం 759 వాహనాలను డెలివరీ చేసింది.

4,750 వాహనాల మైలురాయి

ఓలెక్ట్రా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4,750కుపైగా ఎలక్ట్రిక్ వాహనాలను డెలివరీ చేసింది. 55 నగరాల్లో ప్రజా రవాణా సేవలకు తన బస్సులను అందిస్తోంది. ఈ వాహనాలు ఇప్పటివరకు 750 మిలియన్లకు పైగా గ్రీన్ కిలోమీటర్లు ప్రయాణించాయి. కంపెనీ వద్ద 8,000కుపైగా ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్లు ఉన్నాయి.

కొత్త తరం బస్సులు త్వరలో..

నాలుగో త్రైమాసికంలో కొత్త తరం ఎలక్ట్రిక్ బస్సులను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు ఓలెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ బాబు తెలిపారు. స్థానికంగా తయారీకి ప్రాధాన్యం ఇస్తూ.. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా వీటిని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్రైమాసిక ఫలితాలు ఆదాయం, వాహన విక్రయాలు, లాభదాయకతలో స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తు న్నాయని ఆయన తెలిపారు. నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై కంపెనీ దృష్టి సారించిందన్నారు. ఆర్డర్ల అమలు, ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణ, వినియోగదారులకు నమ్మకమైన సేవలు అందించడం తమ ప్రాధాన్యాలని వివరించారు.

లాభాల్లోనూ వృద్ధి

గత ఏడాది రెండో త్రైమాసికంలో రూ.656.62 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.687.01 కోట్లకు చేరింది. పన్నులకు ముందు లాభం (PBT) రూ.68.46 కోట్ల నుంచి రూ.72.74 కోట్లకు పెరిగింది. ఒక్కో షేరుపై ఆర్జన (EPS) రూ.6.04 నుంచి రూ.6.45కు చేరింది. దేశంలో ఎలక్ట్రిక్ ప్రజా రవాణా విస్తరిస్తున్న నేపథ్యంలో.. ఇప్పటికే ఉన్న ఆర్డర్లను పూర్తి చేయడం, నిర్వహణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- నవంబర్ 14న పెద్ద గడియారం సెంటర్‌లో జరిగే అగ్రి ఎక్స్‌పో – కల్చరల్ ఫెస్ట్‌లో వేలాదిగా పాల్గొనండి
- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పిలుపు





ముద్ర ప్రతినిధి ,నల్గొండ : నల్లగొండ పట్టణంలో అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని, నవంబర్ 14న పెద్ద గడియారం సెంటర్‌లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించే అగ్రి ఎక్స్‌పో, కల్చరల్ ఫెస్ట్‌లో వేలాదిగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పెద్ద గడియారం సెంటర్‌లో కల్చరల్ ఫెస్ట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న వేదికలను వారు పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ, అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఘనత అఖిల భారత రైతు సంఘానికి ఉందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దున్నేవాడికే భూమి అనే నినాదంతో భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజల విముక్తికి బాటలు వేసిన ఘనత రైతాంగ ఉద్యమానిదని తెలిపారు.

రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 14న నిర్వహించే అగ్రి ఎక్స్‌పో, కల్చరల్ ఫెస్ట్‌లో అనేక ఆకర్షణీయమైన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆటలు, పాటలు, కళారూపాలు, పల్లె సుద్దులు, భజనలు, కోలాటాలు, వేషధారణలు, తెలంగాణ సాయుధ పోరాట నాటకాలు ప్రజలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ సాంస్కృతిక సంబరాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతాంగ ఉద్యమ స్ఫూర్తిని చాటాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండా శ్రీశైలం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, నలపరాజు సైదులు, అవుట రవీందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

మంగళవారం,
10 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

సాంప్రదాయ పద్ధతిలో చేస్తే పండుగ

నువ్వు చెప్పిన ఉదాహరణ – స్టాక్ మార్కెట్, ప్రకృతిని మోసం చేసే నెట్ వర్క్, మనది కాదు అని – అది 100% నిజం. మన పండుగలను మనం ఎలా చెడగొట్టుకుంటున్నామో ఒక్కసారి చూద్దాం.

మన పండుగ - ప్రకృతితో బతకడం

మన తాతలు పండుగను ఎలా చేసేవారు?

దీపావళి అంటే – దీపం వెలిగించడానికి నువ్వుల నూనె. ఆ నూనె ఎక్కడిది? మన పొలంలో పండిన నువ్వుల నుంచి, మన గానుగలో ఆడినది. వత్తి ఎక్కడిది? మన పొలం గట్టున పండిన పత్తి నుంచి. దీపం ఎక్కడిది? మన ఊరి కుమ్మరి చేసిన మట్టి ప్రమిద.

సంక్రాంతి అంటే – కొత్త బియ్యంతో పొంగల్. ఆ బియ్యం ఎక్కడిది? మన పొలం నుంచి. బెల్లం ఎక్కడిది? మన చెరుకు గానుగ నుంచి. ముగ్గు ఎక్కడిది? మన ఇంటి ముందు ఉన్న ముగ్గురాళ్ల పొడి.

ఆరోగ్యం ఎక్కడుంది? ఆ నూనె తింటే బలం, ఆ మట్టి ప్రమిదలో దీపం వెలిగితే కంటికి చల్లదనం, ఆ కొత్త బియ్యం తింటే జీర్ణశక్తి పెరుగుతుంది.

ఆనందం ఎక్కడుంది? ఆ నూనె గానుగ ఆడే వాడికి డబ్బు వచ్చింది, కుమ్మరికి డబ్బు వచ్చింది, పత్తి పండించిన రైతుకు డబ్బు వచ్చింది. డబ్బు ఊర్లోనే తిరిగింది. అందరూ కలిసి పండుగ చేసుకున్నారు. దీన్నే ★సనాతన ధర్మం★ అన్నారు – అంటే ప్రకృతితో కలిసి, అందరితో కలిసి బతకడం.

మన గ్రామంలో మనకు కావాల్సింది మనం తయారు చేసుకుని బతికేవాళ్లం. బయటి నుంచి ఏమీ తీసుకురావాల్సిన అవసరం లేదు. అదే స్వావలంబన. అదే స్వరాజ్యం.

విదేశీ పద్ధతిలో చేస్తే అదే పండుగ - అప్పు, రోగం



ఇప్పుడు పండుగ విదేశీ సంప్రదాయంతో

ఇప్పుడు దీపావళి ఎలా చేస్తున్నాం?

దీపం – చైనా నుంచి వచ్చిన LED లైటు. ప్లాస్టిక్ ది, ఒక్కసారి వాడి పారేసేది. దాని వల్ల కంటికి నష్టం, భూమికి నష్టం.

నూనె – ఎక్కడో ఫ్యాక్టరీలో, కెమికల్ తో తయారైన రిఫైన్డ్ ఆయిల్.

స్వీట్ – స్విగ్గీ, జొమాటోలో ఆర్డర్ పెట్టిన, మైదా, డాల్డా, కలర్ వేసిన స్వీట్.

బట్టలు – విదేశీ బ్రాండ్, క్రెడిట్ కార్డు మీద EMI లో కొన్న బట్టలు.

పండుగ ఒక్కరోజు – ఆనందం 2 గంటలు. ఆ తర్వాత ఏంటి? క్రెడిట్ కార్డు బిల్లు, షుగర్ పెరగడం, ఇంటి నిండా ప్లాస్టిక్ చెత్త.

ఇక్కడ ఆరోగ్యం ఏది? ఆనందం ఏది?

ఇది పండుగ కాదు, ఇది షాపింగ్. ఇది సనాతనం కాదు, ఇది విదేశీ వ్యాపారం.

నువ్వు చెప్పిన ఉదాహరణ

నువ్వు చాలా లోతైన మాట అన్నావు – "స్టాక్ మార్కెట్ మన పద్ధతి కాదు, ప్రకృతిని మోసం చేసే నెట్ వర్క్ మనది కాదు"

నిజం.

మన పద్ధతి ఏంటి? – ప్రకృతితో కలిసి బతకడం. విత్తనం నాటడం, 4 నెలలు ఎదురుచూడడం, పంట కోయడం, తినడం. ఇందులో మోసం లేదు. నువ్వు కష్టపడితే ప్రకృతి ఫలితం ఇస్తుంది.

విదేశీ పద్ధతి ఏంటి? – ప్రకృతిని మోసం చేసి బతకడం. స్టాక్ మార్కెట్ లో ఏం జరుగుతుంది? నువ్వు పొలం పండించవు, చెట్టు నాటవు, కానీ ఒక కంపెనీ పేరు మీద డబ్బు పెడతావు, ఆ డబ్బు ఒక సెకనులో పెరుగుతుంది, ఒక సెకనులో పోతుంది. ఇందులో చెమట లేదు, ఎదురుచూడటం లేదు, కేవలం జూదం ఉంది.

మన ఊర్లో ఒకడు బాగా పండిస్తే – ఊర్లో అందరికీ తిండి దొరుకుతుంది.

స్టాక్ మార్కెట్ లో ఒకడు బాగా సంపాదిస్తే – ఇంకొకడు నష్టపోతేనే వాడికి లాభం వస్తుంది. ఇది ఒకరినొకరు తొక్కుకునే నెట్ వర్క్.

అందుకే మన పూర్వీకులు 'లక్ష్మి – చంచలమైనది, కష్టపడి వచ్చేదే నిలబడుతుంది' అన్నారు. గాలి నుంచి వచ్చిన డబ్బు, గాలిలోకే పోతుంది. చెమట నుంచి వచ్చిన డబ్బు, భూమిలోనే నిలబడుతుంది.

మనది – ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థ (Production Economy). మనం ఏదైనా తయారు చేస్తాం.

వాళ్లది – ఊహాగాన ఆర్థిక వ్యవస్థ (Speculation Economy). వాళ్లు ఏదో ఊహిస్తారు, కొంటారు, అమ్ముతారు.

ముగింపు - మళ్ళీ గ్రామానికి వెళ్దాం

మన పండుగలు మనకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలి అంటే – మళ్ళీ మన సాంప్రదాయంలోకి వెళ్లాలి.

– దీపావళికి – చైనా లైటు కాదు, మట్టి ప్రమిద కొను. ఊరి కుమ్మరి బతుకుతాడు.

– స్వీట్ – ఆన్ లైన్ లో కాదు, ఇంట్లో అమ్మ చేతితో చేయించు. ఆరోగ్యం నిలబడుతుంది.

– బట్టలు – బ్రాండ్ కాదు, మన చేనేత వాళ్ళ దగ్గర కొను. మన సంస్కృతి నిలబడుతుంది.

– డబ్బు – స్టాక్ మార్కెట్ జూదంలో కాదు, పొలంలో, ఆవులో, చిన్న పరిశ్రమలో పెట్టు. ప్రకృతి నిలబడుతుంది.

దేశీ సంప్రదాయం – నీకు వస్తువు ఇస్తుంది, కానీ ఆనందాన్ని తీసేస్తుంది.

మన సనాతన సంప్రదాయం – నీకు వస్తువు తో పాటు, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, అందరి ప్రేమను కూడా ఇస్తుంది.

పండుగ అంటే – కొనడం కాదు, తయారు చేయడం.

పండుగ అంటే – చూపించడం కాదు, పంచుకోవడం.

అది తెలుసుకుంటే – ప్రతి పండుగ మళ్ళీ నిజమైన పండుగ అవుతుంది.



డబ్బులు లేని యవ్వనం..
తోడు లేని వృద్ధాప్యం..

"మనిషి జీవితంలో డబ్బులు లేని యవ్వనం,
తోడు లేని వృద్ధాప్యం ఈ రెండూ నరకమే"...
ఇదే జీవితంలో దాగి ఉన్న ఒక లోతైన సత్యం.
జీవితం మనిషికి అన్నీ ఒకేసారి ఇవ్వదు.
ఒక దశలో శక్తిని ఇస్తుంది... కానీ సంపదను ఇవ్వదు.
మరో దశలో సంపదను ఇస్తుంది... కానీ ఆ సంపదను ఆస్వాదించే శక్తిని తగ్గిస్తుంది.
చివరికి శరీరం ఉంటుంది... జ్ఞాపకాలు ఉంటాయి...
కానీ పక్కన తోడుగా మనిషి ఉండకపోవచ్చు.

యవ్వనం అంటే సంపాదించగల శక్తితో పాటు రేపు అనే కాలం.
వృద్ధాప్యం అంటే సంపాదించిన దానికంటే, తోడుగా నిలిచే మనుషుల విలువ తెలిసే కాలం.

యవ్వనంలో డబ్బు లేకపోవడం బాధే. కోరికలు ఉంటాయి... అవసరాలు ఉంటాయి... బాధ్యతలు ఉంటాయి... వాటిని మార్చే శక్తి కూడా ఉంటుంది. చేతులు పనిచేస్తాయి. కాళ్లు నడుస్తాయి. మనసులో ఆశ ఉంటుంది. అందుకే ఆ దశలో లేమి అన్నది ఒక పరిస్థితి మాత్రమే; అది జీవితానికి తుది తీర్పు కాదు.

కానీ వృద్ధాప్యంలో ఒంటరితనం అలా కాదు.
జీవితమంతా సంపాదించి,
ఉండడానికి ఒక ఇంటిని నిర్మించుకొని,
పిల్లలను పెంచి, భవిష్యత్తు కోసం దాచుకున్న మనిషి... ఒకరోజున కిటికీ దగ్గర కూర్చుని ఒంటరిగా బయటకు చూస్తూ ఉండవచ్చు.
ఇంట్లో అన్నీ ఉండొచ్చు... కానీ "ఎలా ఉన్నావు"...అని పలకరించే బంధం మీతో లేకపోవచ్చు.
అప్పుడు తెలుస్తుంది...
జీవితంలో మనం కూడబెట్టవలసింది ఆస్తి కాదు,తోడుగా ఉండే అనుబంధాలు అని!
మనిషి పుట్టినప్పుడు తనతో ఏమీ తీసుకురాడు.
చనిపోయేటప్పుడు ఏమీ తీసుకెళ్లడు.
మధ్యలో మాత్రం "ఇది నాది... ఇది నా కోసం..." అంటూ జీవితమంతా కూడబెడతాడు.
కానీ చివరికి అతనికి కావాల్సింది ఒక చిన్న గది, రెండు పూటల భోజనం, జీవించి ఉండడానికి మందులు... అంతకంటే ముఖ్యంగా తన మాట వినే ఒక తోడు.

అందుకే జీవితం మనకు ఒక విచిత్రమైన పాఠం నేర్పుతుంది.
యవ్వనంలో సంపాదన అవసరం.
వృద్ధాప్యంలో సాన్నిహిత్యం అవసరం.
కానీ రెండింటికంటే జీవితమంతా అవసరమైనది...మనుషులను కోల్పోకుండా జీవించడం.

డబ్బు సంపాదించాలి. ఎందుకంటే అది అవసరం.
కానీ డబ్బు కోసం మనుషులను కోల్పోతే, ఒకరోజు ఆ డబ్బే మన ఒంటరితనానికి సాక్షిగా మిగిలిపోతుంది.
పిల్లల కోసం జీవితాన్ని అర్పించిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో వారి సమయం కావాలి; పిల్లల ఆస్తి కాదు.
జీవిత భాగస్వామికి చివరి దశలో ఆస్తులు,సంపద అవసరం లేదు; పక్కన కూర్చునే ఒక మనసు చాలు.

జీవితం అడిగేది...
"ఎంత సంపాదించావు" అని కాదు...
"ఎవరెవరి జీవితాల్లో నువ్వు ఒక మనిషిగా మిగిలిఉన్నావు"... అని.
అదే జీవితపు అసలు నిజం.

యవ్వనంలో డబ్బు లేకపోతే జీవితం మనల్ని పరీక్షిస్తుంది.
వృద్ధాప్యంలో తోడు లేకపోతే జీవితం అనుబంధాల అవసరాన్ని గుర్తుచేస్తుంది.

అందుకే సంపాదిద్దాం...అలాగే ఎదుగుదాం...
కానీ సంబంధాలను దూరం చేయకుండా...
మనతో కలిసి నడిచిన మనుషులను వెనక్కి వదిలిపెట్టకుండా.
ఎందుకంటే...
చివరికి మనిషి జీవించడానికి కావలసింది డబ్బు కాదు... జీవితం అర్థవంతంగా నడిపించడానికి తోడుగా ఉండే ఒక మనిషి.

స్పైసీ ఫుడ్ తింటే ప్రయోజనాలు!

భారతీయులు స్పైసీ ఫుడ్స్ తినడానికి ఇష్టపడతారు. అందుకే పచ్చి మిరపకాయలను ప్రతి ఆహారంలో ఉపయోగిస్తారు. పచ్చిమిర్చిని ప్రతిరోజూ ఆహారంలో తీసుకుంటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

పచ్చిమిర్చిలో ఉండే గుణాలు అనేక రకాల ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. మిరపకాయలో ఉండే గుణాలు శరీరానికి చాలా పోషకాలను అందిస్తాయి. ముఖ్యంగా తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజూ పచ్చిమిర్చిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ పచ్చిమిర్చి తినడం వల్ల శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.



కొలెస్ట్రాల్ సమస్యలకు చెక్: పచ్చిమిర్చిలో ఉండే క్యాప్సైసిన్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను సులభంగా నియంత్రించగలదు. అంతే కాదు, రక్తంలో కొలెస్ట్రాల్ చేరడం వల్ల కలిగే అధిక రక్తపోటును కూడా ఇది సులభంగా ఉపశమనం చేస్తుంది. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలనుకునే వారు ప్రతిరోజూ పచ్చిమిర్చిని ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలి.

క్యాన్సర్ నుండి రక్షిస్తుంది: ప్రతిరోజూ పచ్చిమిర్చి తీసుకునేవారిలో క్యాన్సర్ ముప్పు 50 శాతం తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అంతే కాకుండా పచ్చిమిర్చి శరీరాన్ని క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నుండి: చాలా మందికి తరచుగా ఆరోగ్య సమస్యలు ఉంటాయి. దీని వల్ల కొంత మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన కూడా పడుతున్నారు. కానీ అలాంటి వారికి పచ్చిమిర్చి ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది: చలికాలంలో ప్రజలు తరచుగా అనారోగ్యానికి గురవుతారు. అలాంటివారు ప్రతిరోజూ పచ్చిమిర్చిని ఆహారంలో తీసుకోవాలి. దీని గుణాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని ఉపశమనం చేస్తాయి.

ఉప్పులో ఈ మార్పు చేయండి

లక్షలాది ప్రాణాలు కాపాడవచ్చు! పరిశోధనలో కీలక విషయాలు

ప్రతి కిచెన్‌లో ఉప్పు ఉండాల్సిందే.. అయితే ఆ ఉప్పే ఎన్నో ప్రాణాలను తీస్తుందంటూ ఓ అధ్యయనం షాకింగ్ విషయాలు బయటపెట్టింది.. ఉప్పు వాడకంలో చిన్న మార్పు.. లక్షలాది మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందంటోంది.. సాధారణ ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లో కొంత భాగాన్ని పొటాషియం క్లోరైడ్‌తో భర్తీ చేసి తయారు చేసే పొటాషియం సమృద్ధి ఉప్పుతో గుండె, మూత్రపిండాల వ్యాధులను గణనీయంగా తగ్గించవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ మార్పు ద్వారా భారత్‌లో ఏటా సుమారు 4 లక్షల మరణాలను, గుండె సంబంధిత, మూత్రపిండాల వ్యాధులకు సంబంధించిన 15 లక్షలకు పైగా కొత్త కేసులను నివారించవచ్చని పరిశోధకులు అంచనా వేశారు.

30 లక్షల మరణాల అవకాశం

193 దేశాల్లోని పరిస్థితులను పరిశీలించిన ఈ అధ్యయనం Nature Health జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రపంచవ్యాప్తంగా సాధారణ ఉప్పు స్థానంలో పొటాషియం కలిపిన ఉప్పును వినియోగిస్తే ఏటా దాదాపు 29.6 లక్షల మరణాలను నివారించవచ్చని పరిశోధకులు అంచనా వేశారు. అలాగే గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులకు సంబంధించిన 1.017 కోట్ల కొత్త కేసులను అడ్డుకోవచ్చని వెల్లడించారు. ఈ మార్పు వల్ల ఏటా సుమారు 6.943 కోట్ల డిసేబిలిటీ అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్స్ (DALYs) తగ్గే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది.

అధిక సోడియం.. తక్కువ పొటాషియం

ఆహారంలో సోడియం అధికంగా తీసుకోవడం, పొటాషియం తక్కువగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుందని ఆ అధ్యయనం వెల్లడించింది.. హైబీపీ కారణంగా గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో సాధారణ ఉప్పులో కొంత సోడియంను తగ్గించి, దాని స్థానంలో పొటాషియం కలపడం ద్వారా ఈ రెండు ఆహార సమస్యలను ఒకేసారి పరిష్కరించవచ్చని ఆస్ట్రేలియాలోని జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌కు చెందిన సీనియర్ పరిశోధకుడు బ్రూస్ నీల్ తెలిపారు.. చాలా దేశాల్లో గుండె సంబంధిత మరణాల్లో పదో వంతు వరకు ఈ మార్పుతో నివారించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

ఉప్పు మార్చినా భారీ ప్రయోజనాలు

పరిశోధకులు వివిధ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అధ్యయనం చేశారు. ఇంట్లో వంటకు ఉపయోగించే సాధారణ ఉప్పును మాత్రమే పొటాషియం సమృద్ధి ఉప్పుతో మార్చినా ఏటా 18.5 లక్షల మరణాలను, గుండె సంబంధిత, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులకు సంబంధించిన 62 లక్షల కేసులను నివారించవచ్చని అంచనా వేశారు. మరోవైపు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించే ఉప్పును మాత్రమే మార్చినా 15.6 లక్షల మరణాలు, 54.6 లక్షల వ్యాధి కేసులను అడ్డుకోవచ్చని అధ్యయనం వెల్లడించింది. ఇంట్లో వాడే ఉప్పుతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, రెస్టారెంట్ ఆహారాల్లో ఉపయోగించే ఉప్పును కూడా మార్చగలిగితే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు. సాధారణ ఉప్పులాగే పొటాషియం కలిపిన ఉప్పు కూడా కనిపిస్తుందని, రుచి, వంటలో వినియోగం పరంగా పెద్దగా తేడా ఉండదని తెలిపారు.


WHO కూడా ఇదే సూచిస్తోంది

సోడియం వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపరచవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఇప్పటికే సూచించింది. సాధారణ టేబుల్ సాల్ట్ స్థానంలో తక్కువ సోడియం కలిగిన పొటాషియం ఆధారిత ఉప్పు ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సిఫార్సు చేస్తోంది. దీనివల్ల అధిక రక్తపోటు, ఇతర అసంక్రమిత వ్యాధుల భారాన్ని తగ్గించవచ్చని పేర్కొంటోంది. మందుల ద్వారా చికిత్స చేయడంతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే ఎక్కువ మందికి ఆరోగ్య ప్రయోజనాలు అందించే అవకాశం ఉందని బ్రూస్ నీల్ అభిప్రాయపడ్డారు. అయితే పొటాషియం కలిపిన ఉప్పును అందరూ విచక్షణ లేకుండా ఉపయోగించకూడదని పరిశోధకులు హెచ్చరించారు. ముఖ్యంగా తీవ్రమైన మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారిలో రక్తంలో పొటాషియం స్థాయిలు అధికమయ్యే ప్రమాదం ఉంది. దీనిని హైపర్‌కలేమియా (Hyperkalaemia) అంటారు. రక్తంలో పొటాషియం అధికమైతే ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. మొత్తంగా.. సాధారణ ఉప్పు స్థానంలో పొటాషియం సమృద్ధి ఉప్పును వినియోగించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుండె, మూత్రపిండాల వ్యాధుల ముప్పును తగ్గించవచ్చని ఈ అధ్యయనం సూచిస్తోంది.



తిప్పతీగలో ఔషధ గుణాలు

పొలాల్లో చెట్లను అల్లుకుని పిచ్చిమొక్కలా కనిపించే తీగజాతి మొక్క తిప్పతీగ. ఆయుర్వేద ఔషధాల్లో వాడే తిప్పతీగతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేమిటో తెలుసుకుందాము. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది, ఒత్తిడిని పారదోల గల శక్తి తిప్పతీగకు వుంది. తిప్పతీగలో యాంటీ ఆర్థరైటిస్ గుణాలున్నాయి, కనుక నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. తిప్పతీగలో ఉండే ఆల్కలాయిడ్లు, లాక్టోన్లు వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



శరీరంలో షుగర్ లెవెల్స్‌ను తగ్గించడంలో తిప్పతీగ దోహదపడుతుంది. తిప్పతీగలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణం వల్ల జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. తిప్పతీగతో శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి పెరిగి డయాబెటిస్ అదుపులో వుంటుంది. తిప్పతీగను గర్భిణీలు, పాలిచ్చే తల్లులు తీసుకోరాదని ఆయుర్వేదం చెపుతోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.11.2026
www.mudranews.in | @mudranews

రక్తపోటు నియంత్రణకు తోడ్పాటు



దబ్బపండులోని పొటాషియం వంటి పోషకాలు రక్తపోటు సాధారణ స్థాయిలో ఉండేందుకు సహాయపడతాయి. అయితే ఇది బీపీ మందులకు ప్రత్యామ్నాయం కాదు.

జీవో 641 రద్దుపై హామీలు కాదు..

అధికారిక ప్రకటన చేయాలి

సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు రాదు అన్న మంత్రి ప్రకటనకు స్వాగతం
జీవో రద్దయ్యే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుంది
జేఏసీ స్పష్టం



ముద్ర, హైదరాబాద్: సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడాన్ని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) స్వాగతించింది. అయితే మంత్రి ప్రకటన కేవలం హామీగానే మిగిలిపోకుండా, డంపింగ్ యార్డు ఏర్పాటుకు సంబంధించిన జీవో 641ను రద్దు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. జీవో రద్దయ్యే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసింది.రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో గత శనివారం జరిగిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు రాదని, రాని వ్వబోమని ప్రకటించిన నేపథ్యంలో జేఏసీ నాయకులు స్పందించారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి ప్రకటనను స్వాగతిస్తున్నామని, అయితే జీవో రద్దుకు ప్రభుత్వం ఎన్ని రోజుల్లో అధికారిక నిర్ణయం తీసుకుంటుందో స్పష్టం చేయాలని కోరారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న నిరంతర పోరాటాల ఫలితంగానే మంత్రి ఈ ప్రకటన చేయాల్సి వచ్చిందన్నారు. ఇది ప్రజా ఉద్యమం సాధించిన నైతిక విజయమని పేర్కొన్నారు. అయితే గతంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులు డంపింగ్ యార్డు రానివ్వబోమని ప్రకటించిన రెండు రోజులకే అధికారికంగా జీవో విడుదలైన విషయాన్ని గుర్తు చేశారు. అందువల్ల కేవలం మాటలను నమ్మి ఉద్యమాన్ని విరమించే పరిస్థితి లేదన్నారు.గతంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ విషయంలోనూ ప్రజా సంఘాలు పోరాటం చేస్తున్న సమయంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాజెక్టు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, అయితే మూడేళ్లు గడిచినా పనుల్లో పురోగతి లేదని వారు విమర్శించారు. ఇలాంటి అనుభవాల నేపథ్యంలో ప్రభుత్వ హామీల కంటే అధికారిక ఉత్తర్వులకే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.ప్రజలపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎమ్మెల్యే దీక్షా శిబిరం వద్దకు వచ్చి నెల లేదా రెండు నెలల్లో జీవో 641ను రద్దు చేయిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. అలా చేస్తే జేఏసీ చర్చించి ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేసుకునే అంశాన్ని పరిశీలించడానికి సిద్ధంగా ఉందన్నారు. లేనిపక్షంలో డంపింగ్ యార్డు రాదంటూ ప్రకటనలు చేయడం రాజకీయ ప్రకటనలకే పరిమితమవుతుందని, ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేయడానికి ప్రయత్నించినట్లవుతుందని హెచ్చరించారు.జీవో 641ను ప్రభుత్వం అధికారికంగా రద్దు చేసే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని జేఏసీ నాయకులు తేల్చిచెప్పారు. ప్రజా ఉద్యమాల ద్వారానే హక్కులు, విజయాలు సాధించగలమని పేర్కొన్నారు.ఈ ప్రకటనలో జేఏసీ సలహాదారు అబ్దుల్ రబ్ జామి, చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్య, కో–కన్వీనర్లు అర్జునప్ప, రవీంద్రనాథ్, నాయకులు రాజేందర్ రెడ్డి, శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌లో టీవీ యాంకర్ కాల్చివేత.. భర్త అరెస్టు



ముద్ర, రావల్పిండి: పాకిస్థాన్‌కు చెందిన ఓ టీవీ యాంకర్ రాబియాను ఆమె ఇంట్లోనే హత్య చేశారు. రావల్పిండిలో తుపాకీతో కాల్చి చంపారు. ఈ కేసులో ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి అనుమానిత ఆయుధాన్ని సీజ్ చేశారు. స్థానిక ప్రైవేటు టీవీ ఛానల్‌లో యాంకర్‌గా, ప్రోగ్రామ్ హోస్ట్‌గా రాబియా అహసాన్ పనిచేస్తున్నది. నగరంలోని గుల్షానాబాద్ ప్రాంతంలో ఉన్న ఇంట్లో ఆమె శవమై తేలింది. ఈకేసులో అహసాన్ భర్తను అదుపులోకి తీసుకున్నట్లు సిటీ పోలీసు ఆఫీసర్ హసన్ ముస్తాక్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదవశాత్తు తుపాకీ పేలినట్లు ఆ ఇంట్లో పనిచేస్తున్న ఓ వ్యక్తి తెలిపారు. క్రైం జరిగిన ప్రదేశం నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరిస్తున్నారు. పోస్టు మార్టమ్ నిమిత్తం బాడీని ఆస్పత్రికి తరలించారు. టీవీ యాంకర్ మృతి పట్ల ఫస్ట్ లేడీ అసీఫా భుట్టో జర్దారి సంతాపం తెలిపారు. హింసను ఆమె ఖండించారు. ఈ కేసులో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రావల్పిండిలోనే ఇటీవల 45 ఏళ్ల డిజిటల్ మీడియా ఎగ్జిక్యూటివ్ హీనా జావెద్‌ను హత్య చేసిన అంశాన్ని గుర్తు చేస్తూ భుట్టో ఆందోళన వ్యక్తం చేశారు.

ఈజిప్టులో ఘోర రైలు ప్రమాదం.. ఏడుగురు మృతి, 100 మందికి గాయాలు



ముద్ర, ఈజిప్టు: ఈజిప్టులోని గిజా నగరం సమీపంలో ఘోర రైలు ప్రమాదం(Train collision) చోటు చేసుకుంది. గిజా ప్రావిన్స్‌లో రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొన్నాయి. అల్ అయ్యత్ జిల్లా నుంచి ఫయూమ్ వెళ్తున్న ఓ ప్యాసింజర్ రైలు.. కైరో నుంచి అస్వాన్ వెళ్తున్న మరో రైలును వెనక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి(Seven killed) చెందారు. మరో 100 మందికిపైగా గాయాలయ్యాయి. ప్రమాద ధాటికి అనేక బోగీలు పట్టాలు తప్పి కాలువలోకి జారిపడ్డాయని దేశ రైల్వే అథారిటీ తెలిపింది. అత్యవసర బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. ప్రమాద ఘటనపై త్వరితగతిన దర్యాప్తు జరపాలని ఆ దేశ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ అధికారులను ఆదేశించారు. కాగా, ఇదే జిల్లాలో గతేడాది రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ఘటనలో లోకోపైలట్, ఆయన అసిస్టెంట్‌కు గాయాలయ్యాయి. మరోవైపు ఈ ఘోర రైలు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆదివారం ఈజిప్ట్‌లో డిమాండ్లు వెల్లువెత్తాయి.

తిరిగి రావడానికి కొత్త పాస్‌పోర్ట్ ఇవ్వండి


బంగ్లాదేశ్‌ను కోరిన షేక్ హసీనా



ముద్ర, బంగ్లాదేశ్ : స్వదేశానికి తిరిగి రావడానికి తనకు కొత్త పాస్‌పోర్టు ఇవ్వాలని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అక్కడి ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమె.. స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆమె బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తన న్యాయవాది ద్వారా ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు ఓ లేఖను ఈమెయిల్ చేశారు.హసీనా పార్టీ 'అవామీ లీగ్' ఈ విషయాన్ని ధ్రువీకరించింది. లండన్‌లోని మ్యాట్రిక్స్ ఛాంబర్స్‌లోని తన న్యాయ ప్రతినిధుల ద్వారా కూడా ఆమె బంగ్లాదేశ్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. హసీనా సమర్పించిన దరఖాస్తుల ప్రామాణికతను, ఈ విషయంలో చట్టపరమైన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని బంగ్లాదేశ్ హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ చెప్పినట్లు అధికారిక బీఎస్‌ఎస్ వార్తా సంస్థ తెలిపింది. ఆ పత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు హసీనాకు ఏదైనా చట్టపరమైన హక్కు ఉందా..? అనే విషయాన్ని విదేశాంగ, న్యాయశాఖలు పరిశీలిస్తున్నాయని చెప్పారు. మరోవైపు హసీనా విజ్ఞప్తిని హాస్యాస్పదమైనదిగా విదేశాంగశాఖ సహాయ మంత్రి హుమాయున్ కొబిర్ పేర్కొన్నారు. ఆమెకు మరణశిక్ష పడిందని, ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ పాస్‌పోర్టులను జారీ చేయదని వ్యాఖ్యానించారు. ఆమె నిజంగా స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే అప్పగింత ఒప్పందం కింద తనను బంగ్లాదేశ్‌కు అప్పగించమని భారత్‌ను కోరాలని చెప్పారు.

పోలాండ్‌లో కాల్పుల ఘటన.. ఆరుగురు మృతి

గన్‌మెన్ ఇంట్లో మరిన్ని మృతదేహాలు



ముద్ర, పోలాండ్: పోలాండ్‌లో ఓ ఉన్మాది కాల్పులకు తెగించాడు. క్రాకోవ్ నగరంలో ఈ ఘటన జరిగింది. సిటీ సెంటర్‌లోకి గన్‌తో వచ్చిన అతను తన కారు నుంచి జనంపైకి ఫైరింగ్ చేశాడు. సాయుధుడు చేసిన దాడిలో ఆరుగురు మృతిచెందారు. ఓ బ్రిటిష్ పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. ముగ్గురు పోలాండ్ స్థానికులు ఉన్నారు. మరో ఇద్దర్ని గుర్తించాల్సి ఉన్నది. ఉన్మాది కాల్పుల్లో మొత్తం 16 మంది గాయపడ్డారు. బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రియా, పోర్చుగల్, రష్యాకు చెందిన దేశీయులు గాయపడ్డారు. కాల్పులు జరిపిన వ్యక్తిని 25 ఏళ్లు ఉంటాడని భావిస్తున్నారు. మిలిటరీ తరహా దుస్తుల్లో వచ్చిన అతను దాడికి పాల్పడ్డాడు. అటాక్ కోసం మిలిటరీ వెపన్ వాడినట్లు తెలుస్తోంది. తన వాహనంలో మరిన్ని ఆయుధాలు ఉన్నట్లు గుర్తించారు. అనుమానితుడిది రేడికల్ భావజాలం ఉన్నట్లు తెలుస్తోంది. అతివాద ఐడియాలజీతో అతను ప్రేరణ పొందినట్లు పోలాండ్ మంత్రి ఒకరు తెలిపారు. అనుమానితుడి ఇంట్లో సోదాలు చేస్తున్నట్లు పోలాండ్ ప్రధాని డోనాల్డ్ టస్క్ చెప్పారు. అతని రూమ్‌లో మరో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. ఆ మృతులు అతని ఫ్యామిలీ సభ్యులే అని పోలీసులు భావిస్తున్నారు. పోలాండ్‌లో సామూహిక కాల్పుల ఘటనలు జరగడం అత్యంత అరుదు. కానీ క్రాకోవ్‌లోని మెయిన్ మార్కెట్ స్క్వేర్‌లో ఆ ఘటన జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఎన్విడియా సీఈవో జేన్‌సన్‌పై దర్యాప్తు.. షాక్‌లో టెకీ ప్రపంచం



ముద్ర, న్యూయార్క్: టెకీ ప్రపంచంలో సంచలన ఘటన జరిగింది. అమెరికాకు చెందిన ఎన్విడియా కంపెనీ సీఈవో జేన్‌సేన్ హువాంగ్ పై వ్యక్తిగత దర్యాప్తు మొదలుపెట్టారు. చైనీస్ గూఢాచారితో ఆయన రిలేషన్‌లో ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో కంపెనీ బోర్డు సభ్యులు దర్యాప్తునకు పూనుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్విడియా కంపెనీకి విశేషమైన గుర్తింపు ఉన్నది. అయితే కంపెనీ కానీ, దేశ రహస్యాలు బయటకు పొక్కడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు తెలిపారు. ఇక తాను మరో వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నట్లు జేన్‌సేన్ అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన తన భార్య, పిల్లలకు క్షమాపణలు చెప్పారు. చైనీస్ వ్యాపారి అలిస్ హువాంగ్‌తో జేన్‌సేన్ వివాహేతర సంబంధాన్ని కొనసాగించినట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే అలిస్ హువాంగ్.. బీజింగ్ స్పై అంటూ ఇటీవల అమెరికా మీడియాలో కథనం ప్రచురితమైంది. తాను చేసిన పనికి పూర్తి బాధ్యతలను తీసుకోనున్నట్లు జేన్‌సేన్ ప్రకటించారు. ఎన్విడియా కంపెనీ ఉద్యోగుల బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లు ఆయన అంగీకరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద టెకీ కంపెనీల్లో ఎన్విడియా ఒకటి. ప్రస్తుతం అభివృద్ధిలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు చెందిన హార్డ్‌వేర్‌ను ఆ కంపెనీ రూపొందిస్తుంది. ఆ కంపెనీలో గత 30 ఏళ్లుగా జేన్‌సేన్ ఇంచార్జీగా ఉన్నారు. తైవాన్‌లో ఆయన జన్మించారు. తొమ్మిదేళ్ల వయసులో ఆయన ఫ్యామిలీతో అమెరికాకు వలసవెళ్లారు. ఓరేగాన్ స్టేట్ యూనివర్సిటీలో ఆయన గ్రాడ్యుయేషన్ చేశారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ల్యాబ్ పార్ట్నర్ లోరి మిల్స్‌ను ఆయన పెళ్లాడు. ఆమె కూడా ఎలక్ట్రికల్ ఇంజినీర్. ఆ జంటకు ఇద్దరు సంతానం. 1993లో ఎన్విడియాను హువాంగ్ స్థాపించారు. దానికి ముందు ఆయన ఏఎండీ చిప్ తయారీ కంపెనీలో చేశారు. గ్రాఫిక్స్‌ను ప్రాసెసింగ్ చేసే కంపెనీగా ఎన్విడియాకు పేరున్నది. కంప్యూటర్ గేమ్స్‌కు కీలకమైన టెక్నాలజీని ఆ కంపెనీ తయారు చేస్తుంది. ప్రస్తుతం ఆ కంపెనీ తన ఫోకస్‌ను ఏఐకి మార్చింది. ఎన్విడియా మైక్రోచిప్ కంపెనీ విలువ సుమారు 4.5 ట్రిలియన్ల డాలర్లు. ఓపెన్‌ఏఐ, మెటా సంస్థలకు చిప్‌లను డెవలప్ చేసి ఇస్తుంది.విదేశీ ఇంటెలిజెన్స్‌తో సంబంధాలు ఉన్న నేపథ్యంలో జేన్‌షేన్ హువాంగ్‌ను విచారించనున్నట్లు ఎన్విడియా బోర్డు డైరెక్టర్లు ఓ ప్రకటనలో తెలిపారు. అపార అనుభవం, విశేష గుర్తింపు ఉన్న జేన్‌సేన్ హువాంగ్‌పై ఆ కంపెనీ దర్యాప్తు చేపట్టడం టెకీ ప్రపంచం నివ్వెరపోతున్నది. ప్రస్తుతానికి కంపెనీ లీడర్‌షిప్‌లో ఆయనే కొనసాగనున్నట్లు బోర్డు పేర్కొన్నది.

అమెరికాలో దీపావళి వేడుకలను అడ్డుకున్న అతివాదులు

ముద్ర, న్యూయార్క్: అమెరికాలోని సియాటిల్‌లో దీపావళి(US Diwali) వేడుకను అతివాదులు అడ్డుకున్నారు. అమెరికా ఫార్ రైట్ కార్యకర్త జేక్ లాంగ్, తనతో కలిసిన కొందరు గ్రూపు సభ్యులు .. దీపావళి పండుగ సంబరాలను అడ్డుకున్నారు. కార్యక్రమం వద్ద ప్లకార్డులు పట్టుకున్నారు. డాట్ హెడ్స్‌ను డిపోర్ట్ చేయాలని లాంగ్ ప్లకార్డు ప్రదర్శించాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న కొందరు అతన్ని భౌతికంగా నిలువరించారు. తన ఎక్స్ అకౌంట్‌లో లాంగ్ కొన్ని ఫోటోలను పోస్టు చేశారు. హిందువులపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. టెక్సాస్‌లో డెమోక్రటిక్ పార్టీ గెలవడానికి హిందువులే కారణమని ఆయన ఆరోపించారు.వైట్ రిప్లేస్‌మెంట్ అనే సంస్థకు లాంగ్ అధిపతిగా ఉన్నారు. అమెరికా క్యాపిటల్ హిల్‌పై 2021 జనవరి ఆరో తేదీన జరిగిన ఘటనలోనూ అతను ఉన్నాడు. నాలుగేళ్లు జైలుశిక్ష అనుభవించాడు. ట్రంప్ అతనికి క్షమాభిక్ష పెట్టారు. దీంతో అతను 2025లో రిలీజ్ అయ్యాడు. రెండు రోజుల క్రితమే శ్వేత సౌధంలో ట్రంప్ దీపావళి వేడుకలు సెలబ్రేట్ చేసుకున్న విషయం తెలిసిందే. లాంగ్ నిరసన ప్రదర్శను చట్టసభల ప్రతినిధి ప్రమీలా జయపాల్ ఖండించారు. జాత్యాంహకార విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. హిందువులకు దీపావళి ముఖ్యమైన వేడుక అని, ఆ పండుగను సెలబ్రేట్ చేసుకునేందుకు తాము సేఫ్‌గా ఉన్నట్లు ఫీలవ్వాలని, ఇలాంటి విద్వేషపూరిత నిరసనకు ఈ దేశంలో చోటు లేదని ప్రమీలా ఆరోపించారు.



వైట్ హౌస్‌లో ట్రంప్ దీపావళి వేడుకలు




ముద్ర, వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో శుక్రవారం దీపాన్ని వెలిగించి, దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జై భట్టాచార్య, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ సహా అనేకమంది భారతీయ మూలాలుగల ప్రముఖులు, అమెరికా స్టేట్ సెక్రటరీ మార్కో రుబియో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు తులసీదాస్ రచించిన హనుమాన్ చాలీసాను వ్యాపారవేత్త విశాల్ గోండల్ బహూకరించారు. వైట్ హౌస్‌లో దీపావళి పండుగను జరుపుకునే సంప్రదాయాన్ని 2003లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ ప్రారంభించారు.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.11.2026
www.mudranews.in | @mudranews

యాంటీఆక్సిడెంట్లతో ఆరోగ్య రక్షణ

ఎరుపు రంగు దబ్బపండులో ఉండే లైకోపీన్ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది కణాలను ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడుతుంది.



రేకొండలో పిచ్చి కుక్కల దాడి.. ఏడుగురికి గాయాలు



ముద్ర, చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ఏడుగురిపై దాడి చేశాయి. సోమవారం జరిగిన ఈ ఘటనలో గ్రామ సర్పంచ్ అల్లేపు సంపత్ తో పాటు దుద్దేల రాజవ్వ, బుధవ్వ సహా మరో నలుగురు గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కల దాడులతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కుక్కల బెడదను నివారించి తమకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పందిళ్ల శివారులో ఘోర రోడ్డు ప్రమాదం.. తండ్రీకూతురు మృతి



ముద్ర, చిగురుమామిడి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు అక్కడికక్కడే మృతి చెందారు. కారు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన ఏడేళ్ల కుమార్తె మహాన్వి ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ నుంచి కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాంత్ భార్య స్వాతికి తీవ్ర గాయాలు కాగా, కుమారుడు విహాన్ క్రిష్ స్వల్పంగా గాయపడ్డారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు కూడా కాలు విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి సంతాపం తెలిపి, గాయపడిన స్వాతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్న పాలలో కల్తీ



ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్న పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్, పాలపొడి కలిపి కల్తీ చేస్తున్న దందా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారంలో ఈ నెల 6న మహేశ్వరం జోన్ ఎస్ఓటీ, ఫ్యూచర్ సిటీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అండె శ్రీశైలం (43) అనే వ్యాపారిని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 100 లీటర్ల అనుమానిత కల్తీ పాలు, లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్, 35 పాలపొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ పాలను హైదరాబాద్ వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహావీర్ జిమ్ గ్రాండ్ లాంచ్‌లో దుద్దిళ్ల శ్రీనుబాబు



ముద్ర, కరీంనగర్: జిల్లా కేంద్రంలో మహావీర్ జిమ్ 13వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో TPCC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహావీర్ బౌన్సర్స్ (ప్రొఫెషనల్ సెక్యూరిటీ సర్వీసెస్), మహావీర్ బాక్సింగ్ అకాడమీని ఆయన ప్రారంభించారు. యువత శారీరక దృఢత్వంతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం జిమ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా సిరాజ్ హుస్సేన్ నియామకం



ముద్ర, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ కోసం 20 ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న కరీంనగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఎస్‌కే. సిరాజ్ హుస్సేన్‌కు టీపీసీసీ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించారు. పీసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సహా పలు బాధ్యతలు నిర్వహించిన ఆయన, పార్టీ కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. తన నియామకంపై సిరాజ్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



ముద్ర, కరీంనగర్: దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రజలు పల్లెల నుంచి పట్టణాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ప్రయాణికుల రద్దీ నెలకొంది. వరంగల్, హైదరాబాద్ నగరాలకు చేరుకునేందుకు ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు.

పేదల ఇంట్లో సన్న బియ్యంతో మంత్రి శ్రీధర్‌బాబు భోజనం






ముద్ర, పెద్దపల్లి: పేదలకు కడుపునిండా నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.ఆదివారం కాటారం మండలం మేడిపల్లి గ్రామంలో గుండ్ల రమ ఇంట్లో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధిదారుల కుటుంబానికి కలుగుతున్న ప్రయోజనాలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి లబ్ధిదారుల ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ధనవంతులు మాత్రమే తినే నాణ్యమైన సన్న బియ్యాన్ని నేడు ప్రభుత్వ చర్యలతో పేదలు కూడా తింటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పండుగ వేళ పేద కుటుంబం ఇంటికి వెళ్లి వారితో కలిసి భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల రాజ్యమని, ప్రతి పేద కుటుంబంలో సంతోషం నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యం తమ కుటుంబానికి ఎంతో మేలు చేస్తోందని లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీకాంత్, దండు రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని తిరుమల, సర్పంచ్ ప్రవల్లిక పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం: శ్రీధర్ బాబు

కాటారం: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. దీపావళి సందర్భంగా ఆదివారం కాటారం మండలం ధన్వాడ, మేడిపల్లి గ్రామాల్లో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులు ఏపూరి పుష్పలత, గుండ్ల రమ కుటుంబాలతో కలిసి టపాసులు కాల్చి పండుగ సంబరాలు జరుపుకున్నారు. సొంతింట్లో తొలిసారి దీపావళి జరుపుకోవడం పేద కుటుంబాలకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లు అందిస్తామని తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ముద్ర, కరీంనగర్ : కరీంనగర్‌లోని పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్రమంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి పనులలో భాగంగా యూఐడీఎఫ్ నిధులు రూ.4.15 కోట్లు, ఎమ్‌జీఎఫ్ నుంచి రూ.34 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో 46వ డివిజన్ రాంనగర్ ప్రాంతానికి రూ.1.5 కోట్లు, 26వ డివిజన్ బుట్టి రాజారామ్ కాలనీ, సుభాష్‌నగర్ ముదిరాజ్ కాలనీకి రూ.కోటి, 23వ డివిజన్ రెడ్డి ఫంక్షన్ హాల్ రోడ్డు ప్రాంతంలో పనులకు రూ.65లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తుమల్లేశం, పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

ముద్ర, సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘనపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. తలపై సుత్తితో కొట్టి ఓ యువకుడిని దుండగుడు హత్య చేశాడు. మృతుడిని శంకరపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన అజయ్‌గా గుర్తించారు. హుజూరాబాద్‌లోని మెకానిక్ దుకాణంలో అతడు పని చేస్తున్నట్లు సమాచారం. ఘనపూర్‌లో తోటి మెకానిక్‌లతో కలిసి అజయ్ విందు చేసుకున్నాడు. ఆ తర్వాతే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కోతలు లేకుండా ధాన్యం సేకరణ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ముద్ర, ధర్మారం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పత్తిపాక సహకార సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం సేకరించాలని నిర్వాహకులకు మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం తూకం వేసిన రెండ్రోజుల్లో రైతుల ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ శ్రీనివాస్, సీఈవో బుచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

4.50 లక్షల మందికి కొత్త చేయూత పింఛన్లు



కొడంగల్ వేదికగా పంపిణీ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
లబ్ధిదారుల్లో 3.50 లక్షల మంది మహిళలే.. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ముద్ర, కొడంగల్ : తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛను మంజూరు పత్రాలను అందజేశారు.

3.50 లక్షల మంది మహిళలకు లబ్ధి

కొత్తగా మంజూరు చేసిన 4.50 లక్షల పింఛన్లలో 3.50 లక్షల మంది మహిళలు ఉన్నారని సీఎం వెల్లడించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే మంజూరు చేస్తున్నామని, ఉచిత సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని 3.40 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే తన జీవిత లక్ష్యమని రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగితేనే తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.

మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.79 వేల కోట్ల రుణాలు అందించామని, వారి రుణాలపై రూ.1,900 కోట్ల వడ్డీని బ్యాంకులకు చెల్లించామని వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల యూనిఫామ్‌ల కుట్టు పనులు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇందిరమ్మ క్యాంటీన్ల బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించినట్లు తెలిపారు. నవంబర్ 19న కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందించనున్నట్లు ప్రకటించారు. పిల్లల చదువు, ఎదుగుదలే మహిళల నిజమైన అభ్యున్నతికి నిదర్శనమని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పర్యటనలో భాగంగా బొంరాస్‌పేటలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, నూతన పోలీస్ స్టేషన్ భవనాలను సీఎం ప్రారంభించారు. హకీంపేటలో జడ్పీ పాఠశాల, కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభించారు. అనంతరం పర్సాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులు సుమిత్ర, శ్రీనివాస్ దంపతులకు పట్టువస్త్రాలు అందజేశారు. వారి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. పర్యటనలో మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో స్ప్లాష్ బీఐ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభం

ఏఐ, డేటా ఇంటెలిజెన్స్, బిజినెస్ అనలిటిక్స్ రంగాల్లో కార్యకలాపాలు
275 మందికి ఉద్యోగ అవకాశాలు.. 5–7 ఏళ్లలో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి
కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



ముద్ర, హైదరాబాద్ : ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలకు కేంద్రంగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రం డులూత్ కేంద్రంగా పనిచేస్తున్న స్ప్లాష్ బీఐ సంస్థ నగరంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేసింది. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రస్తుతం దేశంలోనే ప్రముఖ జీసీసీ కేంద్రంగా ఎదిగిందన్నారు. నగరంలో 515కు పైగా జీసీసీలు ఉండగా, వాటిలో మూడు లక్షల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారని వెల్లడించారు. గత ఏడాది దేశంలోనే అత్యధికంగా 70కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించాయని తెలిపారు. వచ్చే ఏడాదిలో మరో 100 జీసీసీలను నగరానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జీసీసీలను సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా ప్రపంచ స్థాయి ఉత్పత్తుల రూపకల్పన, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ప్రొడక్ట్ ఇంజినీరింగ్ వంటి అధునాతన రంగాల్లో వాటి పాత్రను మరింత విస్తరించేలా ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు.

రూ.100 మిలియన్ డాలర్ల పెట్టుబడి లక్ష్యం

స్ప్లాష్‌బీఐ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 39 దేశాల్లో 500కు పైగా ఎంటర్‌ప్రైజ్ సంస్థలకు సేవలందిస్తోందని మంత్రి వివరించారు. రాబోయే ఐదు నుంచి ఏడేళ్లలో హైదరాబాద్‌లో 100 మిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ ముందుకొచ్చిందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా డేటా ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌తో పాటు స్ప్లాష్ ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా కొత్తగా 275 మంది నిపుణులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్ప్లాష్‌బీఐ సీఈఓ నవీన్ మిగ్లానీ, సంస్థ ప్రెసిడెంట్, సీటీఓ కిరణ్ రెడ్డి పాశం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.11.2026
www.mudranews.in | @mudranews

బరువు నియంత్రణలో సహకారం



దబ్బపండులో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో తరచూ ఆకలి వేయడం తగ్గి, బరువు నియంత్రణకు ఉపయోగపడుతుంది.

ఈ నెల 20 నుంచి 22 వరకు

యాదగిరిగుట్టలో కార్తీకోత్సవాలు

పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆలయ ఈ.ఓ భవాని శంకర్



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుండి 22 వ తేదీ వరకు నిర్వహించే కార్తీకోత్సవాల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట ఈ.ఓ భవాని శంకర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. కార్తీకోత్సవం – 2026యాదగిరిగుట్ట దేవస్థానం (వైటిడి) – శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం ఈ దేవస్థానంలో పవిత్రమైన కార్తీకమాసం 2026 సందర్భంగా యాదగిరిగుట్ట దేవస్థానం నందు ధార్మిక భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో కార్తీకోత్సవం 2026 ఘనంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు,కార్తీకమాసం యొక్క పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గుర్తించి, భారతీయ సంస్కృతి– వారసత్వాన్ని, సంప్రదాయ ప్రదర్శన కళలను పరిరక్షించి, ప్రోత్సహించాలనే ధృడ సంకల్పంతో యాదగిరిగుట్ట దేవస్థానం (వైటిడి) మొదటిసారిగా మూడు రోజుల సాంస్కృతిక ఆధ్యాత్మిక మహోత్సవాన్ని కార్తికోత్సవం 2026 పేరుతో నిర్వహించడానికి సన్నద్ధమైంది.ఈ ఉత్సవాలలో ప్రఖ్యాత ధార్మిక పండితులు, ఆధ్యాత్మిక వక్తల ఆధ్యాత్మిక ప్రవచనాలు, మనోహరమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, ప్రముఖ సంగీత విద్వాంసులు భక్తి సంగీత కచేరీలు, అలాగే ప్రసిద్ధ కళాకారులు ప్రదర్శించే వివిధ సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తిని పెంపొందించే దివ్య లక్ష్యంతో, మన సంస్కృతి యొక్క శాశ్వత వైభవాన్ని, భారతదేశ శాస్త్రీయ కళారూపాల వైభవాన్ని మరియు తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూ, ఈ పవిత్ర ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించడానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.కార్యక్రమాల వివరాలు...20న శుక్రవారం సాయంత్రం గం.6.00ల నుండి గం.7.30ని.ల వరకుబ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ చే ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి గం.7.30ని.ల నుండి9.00గం.ల వరకు తేలు విజయ చే జానపద భక్తి సంగీత కార్యక్రమం.21న శనివారంఆర్.పి.పట్నాయక్ , నిహాల్, నిత్యసంతోషిని, గోపిక పూర్ణిమ, శ్రీనిధి, స్వప్న (జర్నలిస్టు), వాద్య బృందం సహకారంతో నృత్య కార్యక్రమాలు పరంపర సంస్థ వారి దర్శకత్వంలో సాయంత్రం గం.6.00ల నుండి రా 07.30 ని.ల వరకు. 22న ఆదివారంసా 6.00 గంటల నుండి రా,07.30 ని.ల వరకు రుద్రాక్ష ఫౌండేషన్ వారిచే ఒడిస్సి నృత్య ప్రదర్శన, రా.07.గంటల నుండి 08.00 గంటల వరకు అభినేత్రి బృందం వారిచే తెలంగాణ దేవాలయాల ఇతివృత్తం పై నృత్య ప్రదర్శన, రాత్రి గం.8.00ల నుండి గం.9.00 వరకు కళాకృష్ణ బృందం పేరిణి /రుద్రాక్ష ఫౌండేషన్ వారిచే ఒడిస్సీ మరియు అభినేత్రం ఎ సెంబుల్ టెంపుల్స్ ఆఫ్ తెలంగాణ వారిచే నృత్యప్రదర్శన ఉంటుంది. శ్రీ లక్ష్మీనరసింహ నామార్చన సహిత కోటి పుష్పార్చన కార్తీక ఉత్సవం 2026లో భాగంగా, మొదటి రోజున ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం 20న దేవస్థానం ఆర్చక బృందంచే శ్రీ లక్ష్మీనరసింహ నామార్చన సహిత కోటి పుష్పార్చన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దివ్య నామాలతో స్తుతిస్తూ, కోటి పుష్పాలతో అర్పించే పూజ) నిర్వహించబడును. ఈ కార్యక్రమం ఉదయం 7.00గం.ల నుండి మధ్యాహ్నం 12.0గం.ల వరకు జరుగును.

కరువు నుండి ప్రజల్ని ఆదుకోవడంలో కేంద్రం మొండి చెయ్యి

రైతు ప్రభుత్వం నీతులు తప్ప చేతలు లేవు
రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జహంగీర్



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : కరువు నుండి ప్రజల్ని ఆదుకోవడంలో కేంద్రం మొండి చెయ్యి చూపిందని రైతు ప్రభుత్వమని నీతులు తప్ప చేతలు లేవని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్ అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్లో రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరువు పాలకుల విధానాలు, ప్రత్యామ్నాయ చర్యలు★అంశంపై రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్ లో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కరువు నుండి ప్రజల్ని ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందని, కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ లాంటి మిగతా రాష్ట్రాలకు కేంద్రం నుంచి కరువు బృందాలను పంపి కరువు అంచనా వేస్తుంటే తెలంగాణకు మాత్రం మొండిచేయిచూపిందని ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాల్లో పర్యటించి కరువును అంచనా వేషం జరిగింది కానీ కేంద్రంలో ఉన్నటువంటి మోడీ ప్రభుత్వం కేంద్ర కరువు బృందాన్ని పంపి పంట నష్టాన్ని రైతులను ఎదుర్కొంటున్నటువంటి సమస్యల పైన అంచనా వేయడంలో తీవ్రమైనటువంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నరసింహ మాట్లాడుతూ తాగునీటికి భద్రత పశుగ్రాస రక్షణ సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా సురక్షిత మంచినీటిని క్లోరినేట్ నీటిని అందించాలని కోరారు పేద కుటుంబాలకు సామాజిక భద్రత పింఛన్లను ఎలాంటి జాబితా లేకుండా అందించాలని తెలిపారు.బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ ఉచిత విద్యుత్తును నిరంతరాయంగా కొనసాగించాలని కోరారు. ఈ సెమినార్ లోసిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు మల్లేశం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదయ్య, గడ్డం వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర అనిల్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి వీర్లపల్లి ముత్యాలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాఘవాపురంలో 'ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'



బీబీనగర్, ముద్ర: బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామంలో 'ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, రాఘవాపురం సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలకు మిఠాయిలు పంపిణీ చేసి, వారితో కలిసి బాణసంచా కాల్చారు. ఆయా కుటుంబాలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, వార్డు సభ్యులు తూర్పునూరి రవి గౌడ్, న్యాలపట్ల అజయ్ గౌడ్, పొట్ట మంగమ్మ, నాయకులు రక్తని కృష్ణ, బండారి వెంకటస్వామి, సిద్ధగోని యాదగిరి, భీమగోని బస్వయ్య, పబ్బతి రవి, కోర్ని రమేష్, గోలన్కొండ పురుషోత్తం, పూర్ణచందర్, రక్తాని జంగయ్య, మేకల కృష్ణ, గొలనుకొండ మురళి, సిద్ధగోని వెంకటేష్, సిల్వేరు మహేష్, అంబటి మహేష్, సిద్ధగోని తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను
సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 49 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 27, సర్వే ల్యాండ్స్ 4, పంచాయతీ రాజ్ 3, ఇరిగేషన్ 3, మున్సిపాలిటీ 3,మండల పరిషత్ 2, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, ఉపాధి కల్పన,మైన్స్, విద్య, ట్రాన్స్పోర్ట్, పంచాయతీ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటి కపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ,జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,హౌసింగ్ పీడీ అలివేలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి పట్టణంలోని హుస్సేనాబాద్ కు చెందిన కొలుపాక మల్లయ్య ఇటీవల మృతి చెందగా ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లయ్య కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పెంట నరసింహ, కుక్కదువు సోమయ్య, సాదు విజయ కుమార్, బోయిన బాలయ్య, పిట్టల రాములు, చాగంటి నరసింహ, వల్దాసు ఆంజనేయులు ముదిరాజ్, రాజు, అశోక్, ధనుంజయ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవం



ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి : భువనగిరి పట్టణంలోని స్థానిక జలీల్పురాలోని ఖదీమ్ జామియా ఇస్లామియా అరేబియా పాఠశాలలో స్వతంత్ర సమరయోధుడు ప్రముఖ ఉర్దూ కవి అల్లామా ఇక్బాల్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఉర్దూ దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి మాట్లాడుతూ అల్లామా ఇక్బాల్ తన కవిత్వంతో సమాజానికి శాంతి, సోదరభావం, నైతిక విలువల సందేశాన్ని అందించారని తెలిపారు. ఇక్బాల్ కవిత్వం ఉర్దూ భాష విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, సమాజ శ్రేయస్సుకు దిశానిర్దేశం చేసిందని అన్నారు. అందుకే ఆయన జయంతి రోజున ప్రపంచ వ్యాప్తంగా ఉర్దూ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.ఉర్దూ మన మాతృభాష, ఉర్దూను నేర్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత, అని తెలియజేశారు తమ పాఠశాలలో ఇంగ్లీష్, తెలుగుతో పాటు ఉర్దూ బోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి విద్యార్థి ఉర్దూ నేర్చుకోవడమే కమిటీ ముఖ్య లక్ష్యమని వారు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ షేక్ హమీద్ పాషా మాట్లాడుతూ ఉర్దూ ఎంతో తీయనైన భాష అని, దాని ద్వారా సంస్కారాలు, సాహిత్యం లభిస్తాయని తెలిపారు. "ఉర్దూ ఏ ఒక్క మతానికో పరిమితమైన భాష కాదు, ఇది అన్ని మతాల ప్రజల భాష. ఈ రోజుల్లో ఉర్దూను నిర్లక్ష్యం చేయడం విచారకరం. అని చెప్పారు. కమిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కాజిమ్ అహ్మద్, మాట్లాడుతూ ఉర్దూ భాష ప్రాముఖ్యతను, అల్లామా ఇక్బాల్ సేవలను కొనియాడారు. విద్యార్థులు ఉర్దూ భాషపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు కమిటీ గౌరవ అధ్యక్షుడు ముష్తాక్ చౌదరి, ప్రధానోపాధ్యాయులు మౌలానా షుఐబుర్ రెహ్మాన్, మౌలానా హఫీజ్ గులామ్ దస్తగీర్, మహ్మద్ షుజావుద్దీన్, పాల్గొన్నారు.

భువనగిరి ఏఎంసీ చైర్మన్ పదవి ముదిరాజులకివ్వాలి

తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొలుపుల హరినాథ్ ముదిరాజ్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముదిరాజ్ కులస్తులకు ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు కొలుపుల హరినాథ్ ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులకు పెద్దపీట వేస్తామని చెబుతూ ఎలాంటి పదవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి పట్టణంలో ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నందున ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో వారికి ఇవ్వలేదని ఇటీవల ఖాళీ అయిన చైర్మన్ పదవిని ముదిరాజ్ వారికి ఇవ్వాలని కోరారు.

వికలాంగులను బైండోవర్ చేయించే హక్కు ముఖ్యమంత్రికి ఎక్కడిది?

ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : వికలాంగులను బైండోవర్ చేయించే హక్కు ముఖ్యమంత్రికి ఎక్కడిదని ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రశ్నించారు. సోమవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటన సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు, కార్యకర్తలను ఉదయం నుండే బైండోవర్ చేయడాన్ని ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారి వికలాంగులను బైండోవర్ చేయించిన ఘనత రేవంత్రెడ్డికి దక్కుతుందన్నారు. పోరాట ఫలితమే కొత్త పెన్షన్స్ మంజూరుకొత్త పెన్షన్స్ మంజూరు కోసం గత 3 సంవత్సరాల నుండి చేసిన పోరాటాల ఫలితమే నవంబర్ 8 నాడు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్స్ మంజూరు చేస్తూ నిర్ణయం చేసిందన్నారు. ఈ సమావేశంలో ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు స్వరూపంగా ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బోల్లపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా ఉపాధ్యక్షులు చిత్తలూరి శ్రీహరి పాల్గొన్నారు.

సామాజిక భద్రత పింఛన్లను ఎలాంటి జాబితా లేకుండా అందించాలని తెలిపారు.బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ ఉచిత విద్యుత్తును నిరంతరాయంగా కొనసాగించాలని కోరారు. ఈ సెమినార్ లోసిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు మల్లేశం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదయ్య, గడ్డం వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర అనిల్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి వీర్లపల్లి ముత్యాలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.11.2026
www.mudranews.in | @mudranews

రక్తంలో చక్కెర స్థాయిలకు చెక్

దబ్బపండులో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా సహాయ పడుతుంది. ఆరోగ్యక రమైన ఆహారంలో భాగంగా మితంగా తీసుకోవచ్చు.



ఘనంగా దీపావళి వేడుకలు

దీపాలు వెలిగించి, టపాసులు కాల్చిన కలెక్టర్ దంపతులు

అదనపు కలెక్టర్ నగేష్ కుటుంబంతో సందడి

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లా వ్యాప్తంగా దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఊరు, వాడ, గ్రామం, పట్టణం తేడా లేకుండా దీపావళి పండుగను జరుపు కున్నారు. ఉదయం హరతులు రాత్రి అమావాస్య ఉండడంతో లక్ష్మి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తీరొక్క పటాకుల మోత మోగింది. కలెక్టర్ ప్రతిమా సింగ్ తన క్యాంపు కార్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు. భర్త శుభం సింగ్, కవల పిల్లలు ఏకాంషి, అద్వితలతో కలిసీ దీప ప్రమిదలు వెలిగించారు. కాకర వత్తులు కాల్చారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్థిచారు. అదనపు కలెక్టర్ మెంచు నగేష్ కుటుంబ సభ్యులతో కలిసి అధికార నివాసంలో దీపావళి పండుగ జరుపుకున్నారు. దీపాలు వెలిగించి, టపాకాయలు కాల్చుతూ సందడి చేశారు. దీపావళి మాదిరిగా మెతుకు సీమ అన్ని రంగాల్లో వెలుగొందాలని ఆకాంక్షిస్థిచారు. దీపావళి అమావాస్య సందర్భంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, సంస్థల వద్ద లక్ష్మి పూజలు ఘనంగా జరిపారు. లక్షల రూపాయలు విలువచేసే పటాకులు కాల్చారు. వ్యాపార ముహూర్తాలు ప్రారంభించారు.







రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమావేశం



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్డీఓ డా. కె. రమాదేవి ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన తాజా సూచనలు, మార్గదర్శకాల మేరకు ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియపై చర్చించారు. ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. బిఎల్ఎకు క్షేత్రస్థాయిలో సంబంధిత వివరాలను పరిశీలించి, ధృవీకరణ ప్రక్రియలో అధికారులకు సహకరించాలని సూచించారు.సీఈఓ సూచనల మేరకు అనెక్సర్ –ఎ, అనెక్సర్–బి, అనెక్సర్ –సిలలో పేర్కొన్న వివరాల ప్రకారం ఓటర్ల పునఃపరిశీలనకు సంబంధించిన చర్యలను చేపట్టాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటర్ల పునఃపరిశీలన: ఈనెల 21 చివరి గడువు అన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం ఈనెల 26 చివరి గడువు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఈనెల 30 అన్నారు. నిర్దేశించిన గడువులను దృష్టిలో ఉంచుకుని, అన్ని రాజకీయ పార్టీలు తమ బిఎల్ఎల ద్వారా పునఃపరిశీలన ప్రక్రియలో చురుకుగా పాల్గొని, ఎన్నికల యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

ఎల్‌నినో ప్రభావం.. పంట మార్పిడిపై దృష్టి పెట్టాలి

మెదక్ జిల్లా తాగునీటి అవసరాలకు సింగూరు జలాలు రాష్ట్ర మంత్రి డా.వివేక్ వెంకటస్వామి





ముద్ర ప్రతినిధి, మెదక్:ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలని గనులు,, పరిశ్రమల శాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి డా.గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలన్నారు. వ్యవసాయంతో పాటు పశుపో షణను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మెదక్ జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు సింగూరు జలాలను వినియోగానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రాంచంద్రాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశుసంవర్ధక శిబిరంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. పశువులకు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. జిల్లాలో పశువులు, గొర్రెలు, మేకలకు అందుతున్న వైద్య సేవలపై పశువై ద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రకృతి వైపరీ త్యమని, ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ నియంత్రించలేరని, అయితే ముందస్తు జాగ్రత్తలతో వాటి ప్రభావాన్ని తగ్గించుకో వచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, భూగర్భ జలమట్టాలు పడిపోతు న్నాయని అన్నారు. ఇప్పటికే భూగర్భ జలమట్టాలు సుమారు మూడు మీటర్లు తగ్గినట్లు అధికారులు అంచనా వేస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల బోర్‌వెల్స్ ఉన్నాయని, అక్టోబర్ నెలలోనే 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగిందని మంత్రి తెలిపారు. రైతులు నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియో గించుకోవాలని సూచించారు. వరి సాగుకు అధికంగా నీరు, విద్యుత్ అవసరమవుతాయని, నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులు ఇప్పటి నుంచే పంటల మార్పిడిని చేపట్ట కపోతే వచ్చే యాసంగి సీజన్‌లో నీటి కొరత కారణంగా పంట నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాలని కోరారు. రాష్ట్ర రైతులను ఆదుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి సహాయం కోరుతామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలన్నది ఆయన కల అని తెలిపారు. ప్రాజెక్టు కోసం గతంలో సుమారు రూ.11 వేల కోట్ల మేర ఖర్చు జరిగిందని పేర్కొన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు.మహారాష్ట్ర 150 మీటర్ల నీటి మట్టానికి అంగీకరిస్తే ఈ ప్రాంతానికి సాగునీరు అందించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఇతర ప్రజాప్రతి నిధులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సాగునీటి సమస్య రాజకీయాలకు అతీతమైన అంశమని, రైతుల ప్రయోజనాలే ప్రధానంగా అందరూ కలిసి పనిచేయాలని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేయాలన్న ప్రతిపాదనలపై స్పందిస్తూ.. ప్రాజెక్టులో పంపింగ్, నీటి నిల్వ, విద్యుత్ అవసరాలు, సాంకేతిక పరిస్థి తులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతులకు అవస రమైన సాంకేతిక పరీక్షలు, బోర్‌వెల్స్ పరిశీలన పూర్తయ్యాక తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు.సింగూరు జలాల వినియోగంపై స్థానిక ప్రజా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తులను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. ఈ అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి మెదక్ జిల్లా అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.సమగ్ర పశుసం వర్ధక శిబిరాల ద్వారా పశువులకు వైద్య సేవలు అందించడంతో పాటు రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించడం అభినందనీయమని మంత్రి తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుపోషణను ఆదాయ వనరుగా అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పశుసంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేప డుతోందని, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గ్రామాల్లో పశు సంపదను పెంచేందుకు, గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పశుసంపద పెంపుతో పాటు పాల ఉత్పత్తి, ఇతర పశుసంవర్ధక ఉత్పత్తులను పెంచాలని కోరారు. . పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, రాంచంద్రాపూర్ సర్పంచ్ గీతా నరేందర్, నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆదిత్య వర్మ, ఉప సర్పంచ్ నవీన్, ప్రజాప్రతి నిధులు, అధికారులు, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం గుడిసెల్లో నివసిస్తున్న అత్యంత నిరుపేదలైన 630 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అందజేశారు. 414 మంది లబ్ధిదారులకు 4,14,48,024 కోట్ల రూపాయల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి అన్నారు. నర్సాపూర్ మండలంలోని తుల్జాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. జీరో విద్యుత్, సన్న బియ్యం, నూతన పెన్షన్లు, రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షలమంది విద్యార్థులకు సీఎం బ్రేక్ ఫాస్ట్, మహాలక్ష్మి, ఏటీసీ సెంటర్ ఏర్పాటుచేసి ఉద్యోగాలు కల్పన లాంటి పథకాలు అందిస్తున్నాం అన్నారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అనంతరం నర్సాపూర్ మున్సిపల్ వార్డు 3లో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి, మాణిక్యం, నర్సాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్‌తో ప్రజలకు ఇబ్బందులు..

ద్విచక్ర వాహనం సీజ్‌వీడియో ఆధారంగా స్పందించిన సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు.. నిబంధనలకు విరుద్ధమైన సైలెన్సర్ తొలగింపు

ముద్ర, సూర్యాపేట: ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి అధిక శబ్దాలతో రహదారులపై హల్‌చల్ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఓ బాధ్యతగల యువకుడు అందించిన వీడియో ఆధారంగా స్పందించిన పోలీసులు సంబంధిత ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, వాహనదా రుడిపై కేసు నమోదు చేశారు.సూర్యాపేట పట్టణ రహదారులపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు అమర్చుకుని భారీ శబ్దాలు చేస్తూ, అతివేగంగా ప్రయాణిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో ఓ యువకుడు సదరు వాహనం రహదారిపై అధిక శబ్దాలు చేస్తూ వెళ్తున్న దృశ్యాలను వీడియో తీసి ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డికి అందించారు.దీనిపై తక్షణమే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమంగా అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్‌ను తొలగించారు. అనంతరం మెకానిక్ వద్ద నిబంధనలకు అనుగుణమైన సైలెన్సర్‌ను ఏర్పాటు చేయించారు. వాహనదారుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చడం, అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, రహదారులపై అతివేగంగా వాహనాలు నడపడం వంటి చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే వాహనాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల భద్రత, ప్రశాంతమైన రహదారి ప్రయాణం కోసం పోలీసులకు సహకరించాలని కోరింది.

కీసర పోలీస్ స్టేషన్‌లో రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ శ్రీనివాస్

ముద్ర, హైదరాబాద్: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రూ.2 లక్షల లంచం తీసుకుంటున్న ఆరోపణలపై ఎస్ఐ శ్రీనివాస్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు సమాచారం.ఒక కేసులో చార్జిషీట్ దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు ఎస్ఐపై ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తాన్ని లంచంగా స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది.ఇదే పోలీస్ స్టేషన్‌లో ఇటీవల సీఐ లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘటన మరువకముందే మరో పోలీసు అధికారి ఏసీబీకి చిక్కడం చర్చనీ యాంశంగా మారింది. ఒకే పోలీస్ స్టేషన్‌లో వరుసగా అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది.

అమ్మవారి నాణెం కోసం భక్తుల బారులు

గుల్జార్ హౌస్ వరకు క్యూలైన్లు.. మూడు రోజుల పాటు పంపిణీ

ముద్ర, హైదరాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా చార్మినార్ సమీపంలోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అమ్మవారి ఖజానా నుంచి పవిత్ర నాణేల పంపిణీ ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నాణెం పొందేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు గుల్జార్ హౌస్ వరకు విస్తరించాయి.నాలుగు క్యూలైన్ల ఏర్పాటుభక్తుల రద్దిని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణేల పంపిణీ చేపడుతున్నారు. అమ్మవారి ఖజానా నుంచి లభించే నాణెం ఇంటికి తీసుకెళ్తే శుభాలు కలుగుతాయని, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ నమ్మకంతో ప్రతి ఏటా దీపావళి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారు.మూడు రోజుల పాటు పంపిణీఅమ్మవారి ఖజానా నుంచి నాణేల పంపిణీ కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగనుంది. దీంతో రానున్న రెండు రోజుల్లోనూ ఆలయానికి భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. చార్మినార్ పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది.

అసెబెస్టాస్ కాలనీలో భారీ అగ్నిప్రమాదం

మూడు గోదాములు, 4 వాహనాలు దగ్ధం



ముద్ర, కూకట్‌పల్లి:కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అసెబెస్టాస్ కాలనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక లక్కీ బార్ వెనుక భాగంలో ఉన్న ఒక పేపర్ టీ కప్పులు మరియు ప్లేట్ల తయారీ పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగతో పాటు మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో, అగ్నికీలలు వేగంగా పక్కనే ఉన్న ప్రముఖ నెయ్యి తయారీ సంస్థ 'జిఆర్‌బి' గోడౌన్‌కు, 'హల్దీరామ్స్' నిల్వ గోదాములకు కూడా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మూడు కంపెనీల గోదాములు పూర్తిగా దగ్ధమై తీవ్ర నష్టం వాటిల్లింది. గోడౌన్ ప్రాంగణంలో నిలిపి ఉంచిన 4 టాటా ఏస్ సరఫరా వాహనాలు కూడా పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో మంటల ధాటికి అక్కడ పనిచేస్తున్న ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బాధితులు తక్షణమే అతనిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.స్థానికుల సమాచారంతో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 5 ఫైర్ ఇంజన్ల సహాయంతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం గానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు మరియు నష్టం అంచనాపై దర్యాప్తు ప్రారంభించారు.

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం లో ప్రజావాణి

ముద్ర, శేరిలింగంపల్లి :ప్రజల వినతులు సేకర ణశేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, వారి సమస్యలను అధి కారులతో కలిసి తెలుసుకున్నరు.పురపాలక సేవలకు సంబంధించిన పలు అంశాలపై ప్రజల నుండి వినతులు అందా యి. అన్ని ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ ఆదేశించారు.శేరిలింగంపల్లి సర్కిల్ లో 8 మియాపూర్ సర్కిల్ లో 5, అమీన్ పూర్ సర్కిల్ లో 3, నర్సింగ్ సర్కిల్లో 5, పటాన్చెరు సర్కిల్ లో 2, జోనల్ కార్యాలయంలో 6విన తులను స్వీకరిం చారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా, వేగంగా పరిష్మరించడం ద్వారా ప్రజాభి ముఖ, పారదర్శక పాలన అందించ డమే మా లక్ష్యమని ప్రజావాణి కార్యక్రమం ద్వారా మరోసారి స్పష్టం చేస్తున్నామని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ తెలిపారు.



Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555